
ఆధ్యాత్మిక అంతర్జాల పత్రిక

# శ్రీసన్నిధానం

సంపుటి 02 సంచిక 11

డిసెంబర్ 2023



# శ్రీసన్నిధానం

srisannidhanam.org

ఇందులో


3. సంపాదకీయం
4. నెలవారి పంచాంగం
5. మన దేవాలయాలు
6. రామానుజ సుధామాధురి
8. పుణ్య ఫలాలనిచ్చే పవిత్రమాసం
9. శ్రీపతిస్తుతి
10. శుభాశుభ నిర్ణయాలు–మీమాంస
11. తదీయారాధన
12. శ్వాస్ తృతీయ వార్షికోత్సవాలు
13. జ్యోతిర్విజ్ఞానమ్
15. భరన్యాసము–భగవంతునిపై భారము
16. భాగవతంలో భగవంతుని కథలు
18. శ్రీభాష్య మంగళాచరణ శ్లోకము
20. అవయవ విభూతి
22. సనాతన ధర్మరక్షణ సామాజిక బాధ్యత
24. ఆధ్యాత్మిక వార్తలు



**సంపాదక మండలి**

వొద్దిపర్తి రామచంద్రమూర్తి — చీఫ్ ఎడిటర్

సముద్రాల శారద — వొపీనియన్ ఎడిటర్

డింగరి శ్రీనివాసమూర్తి — మేనేజింగ్ ఎడిటర్




## ముఖచిత్ర పరిచయం

ముఖచిత్రంగా దర్శనమిచ్చిన తిరునారాయణపురం చెలువనారాయణ స్వామి, శ్రీవిల్లి పుత్తూరు గోదాదేవి చిత్రాలు రానున్న పండుగల పరమార్థాన్ని తెలియ జేస్తున్నాయి. వీరిద్దరు శ్రీరామానుజులవారితో అనుబంధంకలవారే. చెలువనారాయణ స్వామి స్వయంభువుగా లభించగా, సోదరునిగా భావించిన గోదాదేవి శ్రీరామానుజులను తరింప జేసింది. ఒకవైపు వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు ప్రాశస్త్యాన్ని తెలిజేస్తే, మరోవైపు తిరుప్పావై దివ్యప్రబంధం వైభవాన్ని వెల్లడి చేస్తున్నాయి. ముక్కోటి దేవతలు వైకుంఠ ఏకాదశి పర్వదినాన స్వామి దర్శనానికి వస్తారని ప్రతీతి. ప్రతి పండుగ, ప్రతి దైవం ఒక సందేశం. ఉత్తరాయణ పుణ్యకాలానికి ముందువచ్చే ఏకాదశి వైకుంఠ ఏకాదశి. లక్ష్మీదేవి గోదాదేవిగా అవతరించి మళ్లీ జీవులను తరింప చేయడానికి భగవంతునికి తనకు తానే అర్పించుకుని చూపింది. ఈ వ్రతాన్ని ఆచరించి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని. అభీష్టాన్ని నెరవేర్చుకోవచ్చని ప్రత్యక్షంగా పరోక్షంగా మనకు తెలియజేసింది ఆండాళ్ తల్లి.


**గౌరవ సంపాదకులు**

శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక

శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి ఆచార్య

శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనర్సింహాచార్యులు

**PUBLISHED BY :** డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్



చిరునామా: ఇ.నెం 10-2-225, విద్యానగర్ కరీంనగర్ ,తెలంగాణా - 505001 ఫోన్ : 878 2253323 ; 9502583323;



నోట్:– సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు మీరూ మాతో కలిసినడువండి! అంతర్జాలంలో పబ్లిష్ చేసేవారు 'శ్రీసన్నిధానం సంచిక నుంచి సేకరణ' అని రాయడం మరువకండి!! కాపీ రైట్ చట్టానికి కట్టుబడి ఉందాం.

## సంపాదకీయం



# సంప్రదాయ లక్ష్మణరేఖ దాటకుండా చూడాలి

సంప్రదాయ లక్ష్మణ రేఖ దాటకుండా ప్రజలంతా సమైక్యంగా సంస్కృతిని కాపాడుకోవాలి. ఇక్కడ ఒక విషయం గుర్తుపెట్టుకోండి లక్ష్మణ రేఖ అన్న పదం వాల్మీకి రామాయణంలో మనకు ఎక్కడ కానరాదు. అయితే ఈ లక్ష్మణ రేఖ ఎలా పుట్టుకొచ్చింది? భారతీయ సంస్కృతిలో ఒక గొప్పతనం ఉంది. అన్ని మంచి విషయాలను మన సంస్కృతిలో అంతర్భాగం చేసుకుంటుంటాం. రచయితలు అన్యాపదేశంగా ఉత్కంఠత కోసం కొన్ని సంఘటనలు ప్రస్తావిస్తారు. అలాంటి సందర్భంలో పుట్టుకొచ్చింది ఈ లక్ష్మణ రేఖ. లక్ష్మణుడు చెప్పిన మూడు మంచి మాటలను 'గీత'గా చెప్పుకోవచ్చు. అది ఎలా అంటే మొదటిది అడవిలో బంగారు జింక అనేది ఉండదు. అది రాక్షస మాయ దండకారణ్యంలో మారీచుడనే రాక్షసుడు మాయ కల్పించాడని చెప్పుకొచ్చాడు. రెండవది శ్రీరాముడిని ఎవరు జయించలేరు. క్షేమంగా తిరిగి వస్తాడని. మూడవది సీతమ్మ రక్షణ నుంచి తాను అంటే లక్ష్మణుడు వెళ్ళిపోతే రక్షణ ఉండదు అన్న భావం ధ్వనించేలా ఈ మూడు మాటలను లక్ష్మణ రేఖగా పరిగణించవచ్చు. అయితే పురాణాల్లో ప్రస్తావన లేని లక్ష్మణ రేఖ రామాయణం చదువుతున్నప్పుడు మనకు తారసపడకపోతే వాల్మీకి రామాయణంలో లేదుకదా అని అనుకోవద్దు. ఇక రామాయణ పఠనానికి వస్తే మనిషిలో మానసిక శక్తిని, ధర్మ ప్రవృత్తిని వృద్ధిచేసి ఔన్నత్యాన్ని ప్రసాదించేది ఇది. దీనివల్ల ఎన్నో లాభాలు ఉన్నాయి. తాత్కాలిక ప్రయోజనాలను పక్కన పెట్టినప్పుడే శాశ్వత ప్రయోజనాలు సిద్ధించగలవు అన్నది వాస్తవం. గ్రంథ రచనలో వాస్తవానికి వస్తే ఇక్కడ మనం ఒక విషయం గ్రహించాలి. భారతీయ సంస్కృతి సంప్రదాయాలను మట్టుపెట్టేందుకు కంకణం కట్టుకున్న విదేశీయులు ఎన్నో చరిత్ర ఆధారాలను తొలగించారు. లేని కొత్త విషయాలను అంశాలను రుద్దారు. అవి కూడా మన జీవన శైలిలో అంతర్భాగం అయ్యాయి. ఈ దశలో మన చరిత్రను ఎప్పటికప్పుడు కొత్త రచయితలు తమకు అనుకూలమైన అంశాలను జోడిస్తూ సంస్కృతిలో అంతర్భాగం చేయాలని ప్రయత్నించారు. ఈ విషయాలను మనం ఎంతవరకు జీర్ణించుకోగలం పొంచి ఉన్న ప్రమాదాన్ని ఆనాడు పసిగట్టలేదు, ప్రతిఘటించనూలేదు. ఇప్పటికైనా మేధావులు తమ ఆలోచనలకు పదును పెట్టాలి. సాధారణ కథలలో అభూత కల్పనలు పరవాలేదు. మనం అవి ఎలా ఉన్నా వాటి గురించి మనం పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ఎందుకంటే అది మన మనస్సుపై ఎలాంటి ప్రభావం చూపదు కానీ, పురాణాలు వాఙ్మయాలు సరళ భాషలో అందించాలన్న రచయితల ప్రయత్నంలో అన్యాపదేశంగా వచ్చిన అంశాలు ఒక్కో మారు ప్రశ్నార్థకంగా తయారవుతాయి. అవి ఎలా చేరాయి? అన్నది మనకు ఒక్కోసారి అర్థం కాని విషయం. ప్రతి విషయాన్ని మంచి దృష్టితో చూసినప్పుడే సుందరం సుమధురం. అయితే ప్రాచీన సంస్కృతీ సంప్రదాయలను కాలరాచే ప్రయత్నం జరిగినప్పుడే ఇబ్బంది. గుండె భారం అవుతుంది. తురుష్కుల దాడి, బ్రిటిష్ పాలన తర్వాత జరిగిందేమిటంటే భారతదేశంలో ఉన్న ప్రాచీన చరిత్ర అంతా కనపడకుండా, ప్రయోజనకరమైన అంశాలు సమూలంగా నాశనం అయిపోయాయి. చారిత్రక ఆధారాలు లేకుండా ప్రాచీన చరిత్రకు సంబంధించిన విషయాలు విశేషాలు కనుమరుగయ్యాయి. ఒకటవ శతాబ్ది నుంచి ఇప్పటివరకు మన శాస్త్రజ్ఞుల పేర్లు. వారి రచనలు కనుమరుగయ్యాయి. పాఠ్యపుస్తకాలు కూడా ఎప్పటికప్పుడు పాలనా వ్యవస్థకు అనుకూలంగా మార్పులు చెందాయి. ఏది వాస్తవం, అవాస్తవమో చెప్పలేని స్థితి. ఉదాహరణకు మూడో శతాబ్దంలో ఉన్న గణిత శాస్త్రజ్ఞులు ఎవరు అని మనం ఒక భాగం గూగుల్ సర్చ్‌లో అన్వేషిస్తే ఒక్క భారతీయుని పేరు కనిపించదు. ఆ శతాబ్దంలో ప్రముఖుడైన కాత్యాయనుని పేరు ఆ జాబితాలో ఉండదు. అందరూ విదేశీయుల పేర్లే కనిపిస్తాయి. ఆనాటి ఒక్క భారతీయ విశ్వవిద్యాలయం పేరు ప్రస్తావనకు రాదు. ఏది ఏమైనా ఆంగ్లేయుల కాలం తర్వాత వచ్చిన చారిత్రక రచనలలో భారతీయుల ప్రాచీన వైభవం విషయం ప్రస్తావన మనకు ఎక్కడా కనిపించదు. కాలరాచిన వాస్తవికతను వడగట్టి మళ్లీ ముందుకు తీసుకురావడం సాధ్యం కాకపోవచ్చు కానీ, శిథిలాల నుంచి ప్రాచీన సంపద శాసనాలు బయటపడినట్లే ఎన్నో చారిత్రక విషయాలు మేధావుల జ్ఞాపకాలు వెలుగు చూసే అవకాశం ఉంది. సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణలో త్రిమతాచార్యులు వారి శిష్యగణం రాసిన రచనలు వాటి వైవిధ్యాన్ని పరిశీలిస్తూ ముందుకు వెళితే లోతుగా అన్వేషణ జరిపే అవకాశం కలగవచ్చు కొన్ని విషయాలకు వెంట వెంటనే సమాధానాలు లభించకపోయినా కాలం దానికి సరైన సమాధానం చెప్పే రోజు రాకమానదు.

-రొద్దపర్తి రామచంద్రమూర్తి (చీఫ్ ఎడిటర్)

# నెలవారి పంచాంగమ్

**కార్తీక మాసం 12-12-23 వరకు 13-12-23 శుక్లపక్షంతో ప్రారంభమై 11-01-24 వరకు. మార్గశిర మాసం**

02-12-2023 వరకు అనూరాధ, 03-12-23 నుండి 15-12-23 వరకు జ్యేష్ఠకార్తి, 16-12-2023 నుండి 28-12-23 మూల కార్తి. 29-12-2023 నుండి పూర్వాషాఢ కార్తి, **పండుగలు :** 08-12-23 సర్వేషాం ఏకాదశి, 11-12-23 మాసశివరాత్రి, 12-12-23 అమావాస్య, 16-12-23 ధనుస్సంక్రమణం, 17-12-23 ధనుర్మాసారంభం, 18-12-23 సుబ్రమణ్య షష్ఠి, 23-12-23 ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి, 26-12-23 పౌర్ణమి, 30-12-23 సంకష్టహర చతుర్థి.

## మాస ఫలాలు

**మేషం:** ఈ నెల అనుకూలం. వృత్తి వ్యాపారాలందు రాణింపు ఉంటుంది. ఆర్థిక లావా దేవీలు సంతృప్తి నిచ్చును. కొన్నిపనులు మధ్యలో నిలిచిపోవును.

**వృషభం:** ఈ నెల గ్రహసంచారం అనుకూలంగా లేదు. గృహ మార్పులు, స్థానచలనం, ప్రయాణాలు, ఆరోగ్య భంగాలు, పనులందు అపజయం.

**మిథునం:** ఈ నెల మిశ్రమ ఫలితాలుంటాయి. వృత్తివ్యాపారాలు ఫర్వాలేదనిపించును. ఆదాయం అంతంతమాత్రమే. స్వల్పంగా ఆరోగ్యభంగాలు. కోపస్వభావం, మాటా మాటా పట్టింపులు.

**కర్కాటకం:** ఈ నెల అనుకూలం, పనులు త్వరితంగా పూర్తి. ఆదాయంనకు లోటుండదు. వ్యవహారాలు అనుకూలం. కోర్టు కేసులు పరిష్కారం. గత సమస్యల నుండి బయటపడుదురు.

**సింహం:** ఈ నెల యందు బాగుంటుంది. కార్యాలు అనుకూలంగా పూర్తగును. ఉద్యోగస్థులు సంతోషకర వార్తలు వింటారు. ఆరోగ్యం బాగుంటుంది.

**కన్య:** ఈ నెల అనుకూలం. ఆరోగ్యం బాగుంటుంది. ఆర్థిక సమస్యలుండవు. వ్యాపార వ్యవహారాలు బాగుండును. ప్రతీ విషయంలో ధైర్యంతో ముందుకు పోగలరు.

**తుల :** ఈ నెల అన్నింటా బాగుంటుంది. ఉద్యోగులకు కలిసివచ్చును. దైవసంబంధ కార్యాలు చేయుదురు. ఆర్థిక సమస్యలుఉండవు.

**వృశ్చికం:** ఈ నెల వ్యాపార వ్యవహారములు అనుకూలించును. ఆదాయంనకు లోటుండదు. నూతన కార్యాలకు శ్రీకారం చుట్టెదరు. ఆరోగ్యం బాగుండును.

**ధనుస్సు:** ఈ నెల వృత్తి వ్యాపారాలు అనుకూలించును. ఆరోగ్యం బాగుంటుంది. ద్వితీయంలో ఆటంకాలు, ఊహించని ఖర్చులు. ఆరోగ్యంలో మార్పులు. శిరో, నేత్ర వ్యాధులు వచ్చును. అకాలభోజనాలు, శారీరకశ్రమఅధికం

**మకరం:** ఈనెల ఆదాయంనకు మించిన ఖర్చులు. వ్యాపార, వ్యవహారములు కలిసిరావు. శత్రు మూలకంగా ధనవ్యయం, కొన్ని వస్తువులను పోగొట్టుకుంటారు. విరోధములు, చికాకులు.

**కుంభం:** ఈ నెల బాగుండును. ఆదాయం వృద్ధిని పొందును. ఆరోగ్యం బాగుంటుంది. ధైర్యంగా ముందుకు పోగలరు. కొన్నిసమస్యలు పరిష్కారమగును. శుభకార్యములకు హాజరగుట.

**మీనం:** ఈ నెల అనుకూలం. వ్యాపారులకు మంచి జరుగును. ఆదాయంనకు లోటుండదు. ఆరోగ్యం బాగుంటుంది. శుభకార్యలాభం. సంతానంతో సఖ్యత.

### ఉపవాసము నందు తినతగినవి

నిషిద్ధములు కాని దుంపలు, పచ్చి కాయలు, కొబ్బరి, నీళ్ళు, పిండితో చేసిన రొట్టెలు, ఉప్పుడు పిండి, గుగ్గిళ్ళు, పంచదార, బెల్లంతో కలిపినవి, పేలాలు, అటుకులు, ఇవి ఫలములతో సమానమైనవి. ( సర్వార్థ చన్ద్రిక)

### మంచి రోజులివిగో...

ఈనెల వివాహ, గృహ ఆరంభ, గృహ ప్రవేశ శుభముహూర్తములు


**01,02,04,07,08,14,16,17,20,21,22,25,28,29,31.**

# మన దేవాలయాలు



## కొంగు బంగారమైన ఆండాళ్ సమేత శ్రీవేంకటేశ్వర స్వామి, తక్కళ్ళపల్లి

**శ్రీకర! వాఙ్మధురసుధా**
**శీకర! పద్మావతీ వశీకర! సౌభా**
**గ్యాకర! దుష్ట సురద్విష**
**భీకర! తక్కళ్ళపల్లి వేంకటరమణ**




పూర్వం కరీంనగర్ జిల్లా ప్రస్తుతం జగిత్యాల జిల్లా కథలాపురం మండలానికి చెందిన తక్కళ్లపల్లి గ్రామములో సుమారు నాలుగువందల సంవత్సరాల క్రితం నుండి శ్రీవెంకటేశ్వర దేవాలయం ఉన్నది. ఇక్కడ ఫాల్గుణ శుద్ధ దశమి నుండి పౌర్ణిమ వరకు బ్రహ్మోత్సవాలు, దసరా నవరాత్రి ఉత్సవాలు నాటి నుండి నేటి వరకు జరుపబడుతున్నాయి. శ్రీవెంకటేశ్వర స్వామికి నిత్యాభిషేకము జరుగుతుంది. పురాతనము నుండి చిలకమర్తి వంశీయులచే స్వామి వారి పూజా కైంకర్యములు నిర్వహింప బడుచున్నవి. ప్రస్తుతము చిలకమర్తి సత్యనారాయణాచార్యులు అర్చకులుగా సేవలందిస్తున్నారు.



పూర్వము మిర్యాల వంశీయులైన జమీందారుల ధర్మ పత్ని కోరుట్ల శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయములో జరిగిన అవమానమునకు చిన్నబుచ్చుకున్నది. తన గ్రామమునకు వచ్చి భర్త అయిన గ్రామాధికారికి తెలిపి ఈ గ్రామములో కూడా వెంకటేశ్వర స్వామి దేవాలయము నిర్మించవలెనని పట్టుబట్టింది. ఈ విషయమై గ్రామములో పెద్దలతో సంప్రదించి వారి అండదండలతో విరాళములు సేకరించి దేవాలయము నిర్మించిరి. గోదావరి నది తీరమున వాల్గొండ గ్రామములో జీర్ణాలయములో గల శ్రీవెంకటేశ్వర స్వామి మూల విరాట్టు విగ్రహము తెచ్చి తక్కళ్లపల్లి లో నిర్మించిన దేవాలయములో ప్రతిష్ఠ చేయడం జరిగింది. ప్రతి పౌర్ణిమ నాడు హోమము, పల్లకీసేవ, అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయి. ఇక్కడ స్వామి వారికి ఐదు ఎకరాల మాగాణి ఏర్పాటు చేయడం జరిగింది. శ్రీమాన్ శ్రీ చిలకమర్తి వెంకటనరసింహాచార్యుల జ్ఞాపకార్థం వారి పుత్రులు స్వామి వారికి వసతి గృహ నిర్మాణం చేపించిరి. జీర్ణమైన దేవాలయ మంటపము రాతితో మరియు వంటశాల, హోమశాల, రథశాలలను గ్రామస్థులు పునర్నిర్మాణము గావించిరి. ఈ క్షేత్రంలో గల ఆండాళ్ దేవి ఎంతో మహిమాన్వితమైనది. కొలిచినవారికి కొంగు బంగారమై కోరిన కోరికలు అనతికాలంలో నెరవేర్చుచున్నది. స్థానిక జమిందారైన మిర్యాల వెంకట్ రావుకు సంతానము లేకపోవుట వలన ఆండాళ్ విగ్రహము చేయించగా వారికి మగ సంతానము కలిగినది. ఆతరువాత వారు బంగారు ఆభరణములు, రథమును చేయించిరి. పరిసర మండలాలు, గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు ఇక్కడ స్వామిని, అమ్మవారిని దర్శించుకొని వారి మొక్కులు తీర్చుకొంటారు. ఈ అరుదైన ఆండాళ్ అమ్మ వారి దేవాలయ అభివృద్ధికి ఆలయ అభివృద్ధి సంఘము, సర్వసంఘ సభ్యుల చేత అనేక కార్యక్రమాలు నిర్వహింపబడుతున్నాయి. ★




శ్రీమాన్ శ్రీ సత్యనారాయణాచార్యులు, అర్చకులు



## నిత్యానపాయిని నిత్యారాధనం

**- శ్రీమతి సముద్రాల శారద**

దేవాలయాలు జాతి ఉజ్జీవన విధానానికి దర్పణాలు. జనుల ఉన్నతికి సోపానాలు. దేవాలయ వ్యవస్థ అతి ప్రాచీనమైనది. నిర్మాణ శైలి ప్రతిభావంతమైనది. అలౌకిక దేవతా స్వరూప భావనకు నిదర్శనం అయినది. భగవంతుని ఉనికిని తెలుపుటకు వేదం శబ్దరూపమైతే వాఙ్మయం లిఖిత రూపమైతే, దేవాలయం దృశ్య రూపం, నిర్మాణ రూపం! ఇక్కడ ఆస్తికులు అయిన జనులు పొందే అనుభూతులు అనిర్వచనీయాలు! దేవాలయాల వల్ల పొందే ఫలితాలు, ప్రయోజనాలు కూడా కోకొల్లలు. మన వైదిక సంస్కృతిని సంపన్నవంతం చేసిన నిలువెత్తు ప్రత్యక్ష నిదర్శనాలు. అతి సామాన్యుని మొదలు కొని సంపన్నుని వరకు సమాజం సమస్తానికి అన్ని కోణాల్లోంచి హితాన్ని కలిగిస్తుంది దేవాలయ వ్యవస్థ. ఒక్క మాటలో చెప్పాలంటే జాతికి గుండె వంటిది దేవాలయం. అటువంటి దేవాలయ వ్యవస్థను సమాజ హితం కోసం పటిష్ఠం చేసిన ఘనత భగవద్రామానుజాచార్యులది. సంకుచిత భావాలను వదిలి అందరికీ దేవాలయ ప్రవేశం కల్పించి అందరూ తరించేలా చేశారు. నేటికీ ఆసేతు హిమాచల పర్యంతం గొప్ప రూపురేఖలతో ఆచార వ్యవహార ములతో దేవాలయ వ్యవస్థ మన గలుగుటకు ఎందరో మహానుభావుల కృషి ఉన్నప్పటికీ భగవద్రామానుజాచార్యులు ఏర్పరచిన విధివిధానాలే ప్రధానమైనవి.ఆ కృషి ప్రత్యక్షంగానే గాక పరోక్షంగా ఎందరికో దారిని చూపింది. ఆ వ్యవస్థను ఎట్లా కాపాడుకోవాలో కూడా నేర్పించారు. ఆ క్రమంలో ఉభయ వేదాలను ప్రకాశితం చేసి ధర్మానుసరణ మార్గాన్ని చూపించారు. ఆచారాలను అనుష్ఠాన, అధ్యయనాలను ప్రభావితం చేశారు. వాస్తవికతను ఆస్తికతను సమన్వయం చేసిన మహనీయులు వారు.



దేవాలయానికి అన్నింటికంటే దేవతామూర్తులు మరియు దేవతారాధనములే ప్రధానమైనవి. ఆరాధనా విధానాలు నిత్య ఏకకాల నియమిత పద్ధతుల్లో ఉండాలని, అనుష్ఠానశీలురైన అర్చకులు ఉన్నప్పుడే ఆ దేవాలయం భగవత్ శోభతో భాసిల్లుతుంది అని శాస్త్ర నియమము.

**"అర్చకస్య తపోయోగాత్ పూజా యాశ్చాతి శాయనాత్**
**అభిరూప్యాచ్చ బింబస్య సదా సన్నిహితోస్మ్యహం"** అని శాస్త్ర వచనం. అంటే అర్చకుని తపో బలము, అత్యధిక పూజా బలము విగ్రహం శుభలక్షణములు కలిగి ఉంటే అచ్చట నేను సన్నిహితుడనై ఉండగలను అని భగవంతుడు చెప్పాడని భగవత్ శాస్త్ర వచనాన్ని పెద్దలు చెప్తారు. అందుకే దేవతారాధనము చేతనుల ఉజ్జీవన ఫల సాధకము అయ్యేవిధంగా ఉండాలి. భగవద్ అనుగ్రహ కారకంగా ఉండే విధంగా, వేద ఆగమోక్త ఆచరణ విధిగా దేవాలయ వ్యవస్థను యతి రాజులు ఏర్పాటు చేశారు అని చరిత్ర చెబుతుంది. అర్చకులను మఠాధిపతులను వేద మార్గ ప్రతిష్ఠాపన పీఠాలను ఏర్పాటు చేశారు.

ఆ క్రమంలోనే తిరుమలలో దేవాలయ వ్యవస్థను మరింత విశేషంగా ఏర్పరిచారు. ఇందుకు అనుసరించే ఆచారాలు, ఎన్నో చారిత్రిక ఆధారాలు ఉన్నాయి.

తిరుమల శ్రీనివాసుని శ్రియఃపతిగా నిరూపించి స్వామి వక్షస్థలంలో శ్రీదేవి రూపాన్ని ఏర్పాటు చేశారు. సర్వశక్తి మయుడైన భగవంతునితో కూడిన మహాలక్ష్మి తత్వాన్ని వైదిక సిద్ధాంతాలన్నీ సమర్థించాయి. ప్రత్యేకించి శ్రీరామానుజ సిద్ధాంతంలో లక్ష్మీ తత్వము మహెూత్కృష్టమైనది. లక్ష్మీ విశిష్టుడైన శ్రీమన్నారాయణుని జగద్రక్షకుడుగా పూర్వా చార్యులు స్తుతిస్తారు. **"యద్భ్రూభంగాః ప్రమాణం స్థిరచర రచనా తారతమ్యే మురారేః"** అని లక్ష్మీదేవి కనుబొమ్మల కదలిక, అనుమతి పరమాత్మ స్థిర చర రచనకు మూలం అని, అమ్మవారి క్రీగంటి చూపు చేతనునికి ఇహపర సాఫల్యం కలిగిస్తుంది. అని మహాలక్ష్మి తత్వాన్ని విశ్లేషిస్తారు వేదం

కూడా లక్ష్మీపతి అగు పరమాత్ముడే జగత్కారణుడు అని బోధిస్తుంది. అందుకే **"శ్రియం జ్ఞాత్వా జ్ఞాతవ్యో భగవాన్ హరిః"** లక్ష్మీదేవిని తెలుసుకున్నప్పుడే శ్రీహరి తెలియ బడతాడని ఆర్యోక్తి. అటువంటి నిత్యానపాయిని అయిన అమ్మవారిని గద్య త్రయంలో ముందుగా స్తుతిస్తారు. రామానుజ సాంప్రదాయానికి "శ్రీ సాంప్రదాయం" అని కూడా పేరు భగవత్ ప్రాప్తికి లక్ష్మీదేవి పురుషకారం అంటారు. **"పురు సనోతి ఇతి పురుషః" "పురుషం కరోతీతి పురుషకారః"** అని పెద్దలు వ్యుత్పత్తి చెప్తారు. (అధికముగా ఇచ్చువాడు, అధికముగా ఇచ్చువానిగా చేయునది) కనుక పురుష కారము. భగవంతుని ప్రార్థనలో ఆరాధనలో లక్ష్మీ పురస్సరంగా చేసుకోవాలని భగవద్ రామానుజాచార్యులు దేవాలయ ఆరాధనలోనూ నిర్మాణాల్లోనూ లక్ష్మీదేవికి ప్రత్యేక స్థానాన్ని కల్పించారు. అనుష్ఠానంలోనూ లక్ష్మీదేవి ప్రాధాన్యం తెలుపునట్లు మంత్ర రత్నంగా ద్వయ మంత్ర, అర్థ అనుసంధానాన్ని విధించారు. భగవంతుని పంచావతారాల్లోనూ లక్ష్మీదేవి నిత్యానపాయినిగా ఉంటుంది అని పెద్దలు చెప్తారు. విభావతారాల్లోనూ "దేవత్వే దేవ దేహేయం మనుష్యత్వే చ మానుషీ" అని లక్ష్మీదేవి స్వామి ఏ రూపంలో ఉన్నా అనువగు రూపంలో తాను నిత్యానపాయినిగా ఎప్పటికీ విడువనిదై ఉంటుంది.

శ్రీరంగంలో యతిరాజులు సంప్రదాయ ఆధ్యాత్మిక సార్వభౌములై వెలుగొందే వేళ గద్య త్రయాన్ని రచించారు. ఫల్గుణి ఉత్సవాల్లో ఒకే శేర్తిపై రంగనాథ, నాచ్చియార్లను వేంచేపు చేసిన సమయంలో ముందుగా అమ్మవారిని **"శ్రీభగవన్ నారాయణాభిమతాను రూప స్వరూప రూప గుణవిభవ"** అని లక్ష్మీదేవి కళ్యాణ గుణాలను, చేతనులపై చూపించవలసిన అనుగ్రహాన్ని, స్వామితోగల సంబంధాన్ని ప్రార్థించారు. శ్రీ, శ్రీమత్, శ్రియం ఇత్యాది లక్ష్మీ నామ అర్థాల స్తుతిగా గద్య సాగుతుంది. మరియు ద్వయ మంత్ర అర్థ వైభవాన్ని కూడా ఈ గద్య తో సమన్వయం చేసి వ్యాఖ్యానాల్లో చెబుతారు. పరమపద నాథుని ఆసనం పై కుడివైపున, క్షీరాబ్ధినాథుని శయనాసనంపై, విభావతారాల్లో అనువగు రూపాలతో అర్చామూర్తులుగా ఉపాలయాల్లో లక్ష్మీదేవి మూర్తిగా, శ్రీరామ లక్ష్మీనరసింహాది మూర్తులలో పర్యంకంపై, శ్రీ వేంకటేశ్వరాది రూపాల్లో వక్షస్థలంపై అమ్మవారు ఉంటుంది.

తిరుమల చరిత్ర వైభవం ద్వారా రామానుజాచార్యులు తిరుమలలో స్థాపన చేసి నియమించిన అనేక విశేషాలు తెలుస్తాయి. యతి రాజులు తిరుమలకు ఎన్నోసార్లు విచ్చేశారు. వారిదేహబంధువు మేనమామగా ఆత్మబంధువుగా జ్ఞానబోధకులైన ఆచార్యులుగా తిరుమల నంబి ప్రసిద్ధులు. ఆళ్వార్ల స్తుతులు, పురాణ ప్రమాణాలు వేదోక్తులు నిత్యం మననం చేసే జగదాచార్యులు తిరుమలలోని చిన్న వివాదంలో పాల్గొని స్వామిని శ్రీనివాసునిగా శ్రియఃపతిగా నిరూపించారు. భక్తునికి శంఖ చక్రాలు సమర్పించడం వల్ల స్వామి మూర్తికి శంఖచక్రాలు లేవని సప్రమాణంగా నిరూపించి శంఖ చక్రాలను తానే ఏర్పాటు చేశారు. పురాణకథానుసారంగా పద్మావతి దేవి తిరుచానూరు యందు వేంచేసి ఉంది. ఒకసారి శ్రీవేంకటేశ్వర స్వామి ఏకాంత మందిరానికి తొండమాన్ చక్రవర్తి అకస్మాత్తుగా ప్రవేశించాడట! వెంటనే కలవరపడి లక్ష్మీదేవి స్వామి వక్షస్థలంలోకి చేరి మాయమైంది. భూదేవి తొండమాన్ నిర్మించిన బావిలోకి వెళ్ళి మాయమైందట! ఆ గుర్తుగానే జగదాచార్యులు లక్ష్మీదేవి మూర్తిని స్వామి వక్షస్థలంలో ఏర్పాటు చేశారు. భూదేవి మూర్తిని ఆ బావిలోనే ప్రతిష్ఠించి అందులోనే స్వామి నిర్మాల్యం వేసేటట్టుగా పూల బావిగా ప్రసిద్ధం గావించారట!

లక్ష్మీ విశిష్టుడైన శ్రియఃపతి స్వరూపం శ్రీవేంకటేశ్వర స్వామి కనుక స్వామి మూర్తి యందు అమ్మవారి స్థానమైన వక్షస్థల మందు వ్యూహలక్ష్మిని స్థాపన చేశారు. అందుకే యతిరాజులను శ్రీనివాస పెరుమాళ్లకు శంఖ చక్ర చిహ్నములు ఇచ్చిన ఆచార్యులుగా, లక్ష్మీదేవిని అర్పించినందున మామగారి స్థానీయులుగా పెద్దలు స్తుతిస్తారు. అలాగే "తిరువాయి మొళి" లో పాశురార్థాలని సేవిస్తూ తిరుమలలో స్వామికి లక్ష్మీ స్వరూపమైన పుష్పాలతో నిత్య కైంకర్యం చేయాలని సంకల్పించారు. అందుకు శిష్యులైన అనంతార్యులను నియమించారు. నాటి నుండి తిరుమల పుష్పమంటపంగా ప్రసిద్ధిగాంచింది.

ఈ విధంగా ఆలయ నిర్మాణాల్లోనూ అర్చమూర్తుల ప్రతిష్ఠాపనలలోను ఆగమోక్త ఆరాధనా విధి విధానాల్లోనూ అనుష్ఠానాది ఆచారాల్లోనూ నిత్యానపాయిని అయిన లక్ష్మీదేవి యొక్క వైభవాన్ని ప్రకాశింప చేశారు "లక్ష్మీనాథ సమారంభాం" అని శ్రీ శ్రియః పతుల శరణాగతి మార్గాన్ని బోధించారు.



# పుణ్య ఫలాలనిచ్చే పవిత్రమాసం
## ధనుర్మాసం

**శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి, స్థానాచార్యులు**
**శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం భద్రాచలం**

“మాసానాం మార్గశీర్షోహం” అని మాసములలో మార్గశిర మాసమును నేనే అంటూ భగవద్గీత విభూతి యోగంలో శ్రీకృష్ణ పరమాత్మ అంటాడు. భగవంతుని యొక్క రూపమే మార్గశిర మాసం. అయితే ఈ మార్గశిర మాసం కేవలం శుష్కమైన తెలుగు మాసాల్లో మార్గశిరమాసమే కాకుండా సూర్యుడు ధనుర్రాశిలో ప్రవేశించిన మార్గశిరమాసం అత్యంత పవిత్రమైనదిగా శాస్త్రాలు పేర్కొంటున్నాయి. సహజంగా ఈ రెండు కలిసే వస్తాయి. మనకు పంచాంగ గణనంలో చాంద్ర మానం సౌరమానం అని రెండూ కనిపిస్తాయి. చంద్రుని గతిననుసరించి గణించే విధానం చాంద్ర మానం. సూర్యుని గతిననుసరించే విధానాన్ని సౌర మానం అంటారు. మాసాల్లో చైత్రము, వైశాఖము, జేష్ఠము, మొదలైన తెలుగు మాసాలు చాంద్రమాన పద్ధతిలో లెక్కించే మాసాలు. పూర్ణిమ నాడు ఏ నక్షత్రం ఉంటుందో ఆ నక్షత్రము యొక్క పేరుతో ఆ మాసం వ్యవహారం ఉంటుంది. సూర్యుడు ఏ రాశిలో ప్రవేశిస్తాడో ఆ రాశికి సంబంధించిన దానిని మాస వ్యవహార నామంగా చెప్పడం అనేది సౌరమానంలో కనిపిస్తుంది. సూర్యుడు మేష రాశిలో ప్రవేశించినప్పుడు మేష మాసమని ఈ విధంగా సౌరమానం పద్ధతిలో మాసముల లెక్క కనిపిస్తుంది. ఆ పద్ధతిలో సూర్యుడు ధనుర్రాశి ప్రవేశించినటువంటి ఈ కాలానికి ధనుర్మాసము అని పేరు. ఆ ధనుర్మాస కాలంలోనే సాధారణంగా మార్గశిర మాసం కూడా వస్తుంది. ధనుర్మాసము, మార్గశిరమాసం కలిసిన రోజులు చాలా పవిత్రమైన రోజులుగా చెపుతారు. ఈ కాలంలో చేసే ఉపాసనాదులన్నీ ఎంతో ఫలితాన్ని ఇస్తాయి. మనకు సంవత్సరానికి దక్షిణాయనం, ఉత్తరాయణము అని రెండు అయనాలు ఉంటాయి. కర్కాటక రాశిలో సూర్యుడు ప్రవేశించిన కాలం నుండి ధనుర్మాసం వరకు వుండే కాలం దక్షిణాయనం అని. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించిన నాటి నుండి మిథునమాసం వరకు ఉండే ఆరు నెలల కాలం ఉత్తరాయణం. మనకెలాగైతే రాత్రి పగలు వుంటాయో దేవతలకు కూడా రాత్రి పగలు ఉంటాయి. దేవతలకు దక్షిణాయనం రాత్రి అయితే, ఉత్తరాయణం పగటి కాలం. మనం కూడా ఎంతో పవిత్రంగా భావించి ఎలాగైతే పవిత్ర కర్మలన్నీ ఉదయకాలంలో చేస్తామో అట్లే దేవతలు కూడా వాళ్ళ పగటి కాలంలోనే వారు వారికి కావలసిన ఆధ్యాత్మిక కార్యములన్ని నెరవేరుస్తారు. మనము ఎలాగైతే రాత్రి నిద్రపోతూ గ్రామ్యమైన సుఖాల్లో మునిగి ఉంటామో దేవతలు కూడా దక్షిణాయన కాలంలో వుంటారు. అందువలన దక్షిణాయన కాలంలో కంటే ఉత్తరాయణ కాలంలో చేసే పుణ్యకార్యాలు ఎక్కువ ఫలాన్ని ఇస్తాయి. అందుకే దేవతా ప్రతిష్ఠాదులన్నీ ఉత్తరాయణ కాలంలోనే చేస్తారు. ఈ ధనుర్మాసము దక్షిణాయన కాలము చివరి రోజులలో వస్తుంది. రాత్రి చివరిదైన నాలుగవ జామును బ్రహ్మముహూర్త కాలంగా మనం చెప్పుకుంటూ ఉంటాం. అది సత్వోత్తర కాలంగా చెప్తారు. బ్రహ్మముహూర్త కాలంలో ఏ పని తలపెట్టినా అది నిర్విఘ్నముగా పరిసమాప్త మవుతుంది. ఆ సమయంలో యోగాభ్యాసము, ధ్యానాదులు మొదలైనవి చేయాలని బోధన చేస్తారు. **“బ్రహ్మే ముహూర్తే చోత్థాయ చింతయేదాత్మనో హితం”** అని బ్రాహ్మముహూర్తంలో నిద్రలేచి ఆత్మ హితం కోసమని ధ్యానాదులు (మిగతా 14 వ పేజీలో)

**బ్రహ్మముహూర్త కాలంలో ఏ పని తలపెట్టినా అది నిర్విఘ్నముగా పరిసమాప్త మవుతుంది. ఆ సమయంలో యోగాభ్యాసము ధ్యానాదులు మొదలైనవి చేయాలని బోధన చేస్తారు.**

( 8 వ పేజీ తరువాయి ) చేసుకోవాలని ధర్మ శాస్త్రాలు చెపుతున్నాయి. అటువంటి పవిత్రమైన కాలం బ్రహ్మ ముహూర్త కాలం. దేవతలకు కూడా బ్రహ్మముహూర్త కాలం పవిత్రమైనది. ఈ కాలమే ధనుర్మాసము. దేవతలకు బ్రహ్మముహూర్త కాలమైన ధనుర్మాసంలో వచ్చే శుద్ధ ఏకాదశి నాడు కార్య వైకుంఠంలో క్షీర సముద్రములో పవళించివున్న వైకుంఠనాథుడైన శ్రీమన్నారాయణున్ని ఉత్తర ద్వారం నుండి వెళ్లి దర్శనం చేసుకొంటారు. ఆయన అనుగ్రహాన్ని పొందుతారు. కనుక వైకుంఠ ఏకాదశికే ముక్కోటి ఏకాదశి అని పేరు. వైకుంఠుడు ఉత్తర ద్వారంనుండి దర్శనాన్ని ప్రసాదించే రోజు కనుక వైకుంఠ ఏకాదశి అని పేరు. దేవతలందరు ప్రసన్నంగా వుండేటి కాలం కనుక ఈ మాసంలో ఏ దేవతను పూజించినా ఆ దేవత శీఘ్రంగా ఫలప్రదుడు అవుతాడు. ప్రధానంగా దేవదేవుడైన విష్ణుమూర్తిని పూజించాలి. 'మాసానాం మార్గ శీర్షోహం' అని కృష్ణుడే చెప్పినందువల్ల ఈ మాసంలో విష్ణువుని పూజించడం అత్యంత ఫలప్రదకరం. అలా ఈ మాసం విష్ణువును పూజించటం అత్యంత ఫలదాయకం. అందుకనే ఈ మాసంలోనే గోదాదేవి తిరుప్పావై అనే ఒక వ్రతాన్ని ఆచరించి మనందరిచేతా కూడా ఆచరింప చేసినది. లౌకికులైనటువంటి వారితో ఎలాంటి సంబంధం లేదు అని అనుకొని రంగనాథస్వామినే తాను పరిణయమాడాలి అని గోదాదేవి ధనుర్మాసంలో తిరుప్పావై అనే వ్రతాన్ని ఆచరించి ఒక ప్రబంధంగా చెప్పింది. ఈ వ్రతం చేసే వారంతా గోదాదేవి చెప్పిన తిరుప్పావై ప్రబంధాన్ని స్వామి సన్నిధానంలో రోజుకు ఒక పాశురం చొప్పున పారాయణం చేసి హారతి సమర్పించి ఈ వ్రతాన్ని వారు నిర్వహిస్తారు.


గోదాదేవి సాక్షాత్తు భూమాత అవతారం. భూదేవియే ఈ లోకులను అనుగ్రహించడం కోసమని గోదాదేవిగా అవతరించింది. శ్రీవిల్లిపుత్తూర్ అనే దివ్యదేశంలో విష్ణుచిత్తుడు అనే విష్ణు భక్తాగ్రేసరునికి తాను కుమార్తెగా తులసి వనంలో లభించింది. సీతాదేవి ఎలాగైతే జనక మహారాజుకి భూమిలో లభించిందో అదే విధంగా విష్ణుచిత్తుల వారికి తులసివనంలో తులసి పాదు చేస్తున్నప్పుడు అయోనిజగా లభించింది. విష్ణుచిత్తుల వారు చిన్నతనం నుండే ఉగ్గుపాలతో ఆమెకు విష్ణు భక్తిని రంగరించి బోధించి పెంచారు. ఎంత గొప్ప విష్ణు భక్తి అంటే మణవాళ మహామునుల వంటి మహనీయులు చెపుతారు. "పింజాయ్‌దుత్తాళై ఆండాళై" అని. పిందెగా వున్నపుడే పండిపోయింది అని చిన్నతనంలోనే పరిపక్వమైన జ్ఞానం లభించినటువంటిది అని గోదాదేవి గురించి వారు అభివర్ణిస్తారు. మనమంతా ఈ సంసార మండలంలో పునరపి జననం పునరపి మరణం అన్నట్లు తిరుగుతూ ఉంటాం. అటువంటి ఈ సంసారాన్ని పోగొట్టుకోవటమే ముక్తి, మోక్షము. ఆ మోక్షము అనే ఆనందం ఎప్పుడు లభిస్తుంది అంటే భగవంతుని సన్నిధానంలో మాత్రమే లభిస్తుంది. ఆచరణాత్మకమైన తిరుప్పావై బోధన వల్ల ఆమె కూడా రామచంద్రునివలె మానవధర్మాలను లోకానికి ఆచరించి చూపించింది. కనుక భగవంతుని సాయుజ్యాన్ని పొందటమే మానవ జీవిత లక్ష్యం. ఆ లక్ష్యాన్ని గోదాదేవి తిరుప్పావై వ్రతాచరణ ద్వారా లోకానికి చూపింది. "ఓ మానవులారా! నేను ఏవిధంగా రంగనాథుణ్ణి పతిగా పొందానో నా వలెనే మీరు కూడా విష్ణువును చేరండి!" ఈ తిరుప్పావై ప్రబంధం ద్వారా విష్ణువుని చేరండి! అలాంటి గొప్ప వ్రతం ఈ ధనుర్మాస వ్రతం. ఈ వ్రతం ద్వారా మనకు గోదాదేవి చెప్పింది ఏమిటి అంటే **"కల్పాదౌ హరిణా స్వయం జనహితం దృష్టేన సర్వాత్మనాం ప్రోక్తం స్వస్య చ కీర్తనం ప్రపదనం స్వస్మై ప్రసూనార్పణం..."** అనందాళ్వాన్ అనే మహానుభావులు గోదా చతుశ్లోకిలో చెపుతారు. అసలు గోదాదేవి అవతారము ఎందుకు ఏర్పడింది అంటే కల్పాదిలో వరాహమూర్తి తన భార్య అయిన భూదేవికి తనను ఉపాసించే విధానాన్ని చెప్పారు. ఎవరైనా సరే ఈ లోకంలో వుండే వారు వారియొక్క హితాన్ని కాంక్షిస్తూ వున్నట్లైతే ప్రపదనం ప్రపత్తి చేయటం అంటే శరణాగతి చేయడం. ప్రసూనార్పణం అంటే పూల కైంకర్యం చేయడం. భగవంతుని నామాన్ని కీర్తనం చెయ్యడం ఇవి సులభముగా పొందే సాధనాలు. తిరుప్పావై ప్రబంధం ద్వారా భగవంతుని సంకీర్తనం చేసింది. ఆయనకు మాలికలను సమర్పించింది. అలాగే శరణాగతి చేసింది. ఈ మూడు ఆచరణల ద్వారా ధనుర్మాస వ్రతాన్ని చేసి ఈ విధంగా మీరు ఆచరించండి! అంతా తరిస్తారు! అని మనకు తిరుప్పావై బోధించిన గొప్ప బోధకురాలు గోదాదేవి. అలాంటి గోదాదేవి ఆచరించిన వ్రతం ధనుర్మాసంలో మనమూ ఆచరించి ఆ గోదాదేవి అనుగ్రహానికి పాత్రులమై, భగవంతుని అనుగ్రహాన్ని పొంది మనమంతా మన జీవితాలను సార్థక్యం చేసుకొందాం!.

★

# శ్రీపతి స్తుతి

# సుభాషితం
## మంచి మాట

**శ్రీమాన్ శ్రీ అమరవాది వేంకటనరసింహాచార్యులు**



ప్రాతర్నిత్యాను సంధానంలో **'పంచాయుధ స్తోత్రము'** మూడవ ఆయుధము గద

**హిరణ్మయీం మేరుసమానసారాం**
**కౌమోదకీం దైత్యకులైకహంత్రీమ్।**
**వైకుంఠవామాగ్ర కరాభిమృష్టాం**
**గదాం సదాహం శరణం ప్రపద్యే॥**

ప్రతిపదార్థం: హిరణ్మయీం = బంగారుతో చేయ బడిన, మేరు సమాన సారాం = మేరు పర్వతముతో సమానమైన బలము గలిగి యున్న, దైత్యకులైకహంత్రీమ్= రాక్షస కులమును నిర్మూలించు అద్వితీయమైన, వైకుంఠ= శ్రీ వైకుంఠవాసియైన శ్రీమన్నారాయణుని, వామాగ్రకర = ఎడమచేతి చేత, అభిమృష్టాం = ధరింప బడియున్న, కౌమోదకీం = 'కౌమోదకి' అనే పేరు గల, గదాం = గద ' అనే ఆయుధమును, అహం = నేను, సదా = ఎల్లప్పుడు, శరణం పపద్యే = శరణముగా పట్టుకొనుచున్నాను.

తాత్పర్యము: విష్ణుమూర్తి ఎడమ చేతిలో గద ఉంటుంది. దానికి 'కౌమోదకి' అనే పేరు. అది బంగారంతో చేయబడి ప్రకాశిస్తుంటుంది. దాని బలము సామాన్య మైనది గాదు. మేరు పర్వతంతో సమానమైనది. దుష్ట రాక్షస కులమును నశింప జేయునట్టిది. దానిని ఎల్లప్పుడు నేను శరణు వేడుచున్నాను. ఈ గదాయుధంతో స్వామి వరహావతారంలో 'హిరణ్యాక్షుడు' అనే రాక్షసుని సంహరించి నట్లు 'భాగవత' వచనము. భగవానుడు ఏ అవతారంలో ఏ దుష్ట సంహారం చేసినా అందులో సుదర్శనుడు ఉంటాడని అహిర్బుధ్న్య సంహితలో వుందని శ్రీసుదర్శన శతకంలో 'వాణి పౌరాణి కీయం ప్రథయతి' అనే శ్లోకంలో కూరనారాయణ ముని ఉవాచ.

నాలుగవ ఆయుధం 'ఖడ్గం'

**శ్లో॥ రక్షోసురాణాం కఠినోగ్ర కంఠ**
**చ్ఛేదక్షరచ్ఛోణిత దిగ్ధధారం।**
**తం నందకం నామ హరేః ప్రదీప్తం**
**ఖడ్గం సదాహం శరణం ప్రపద్యే॥**

ప్రతిపదార్థం: రక్షోసురాణాం = జన్మతో ఏర్పడిన రాక్షసుల యొక్క, స్వభావంతో ఏర్పడిన క్రూరులైన అసురుల యొక్క, కఠిన = గట్టిగా బలిసియున్న, ఉగ్ర = ఉన్నతమై భయంకరమైన, కంఠ = కంఠములను. ఛేద = నరికి వేయడం చేత, క్షరత్ = నిరంతరం ధారలుగా కారుతున్న, శోణిత = నెత్తురు చేత, దిగ్ధ =పూయబడిన, ధారం = అంచు గలిగి, ప్రదీప్తం = మంటలతో వెలుగుచున్న, తం = అట్టి ప్రసిద్ధమైన, నందకం = నందకమనే, నామ = పేరు గల, హరేః = శ్రీహరి యొక్క, ఖడ్గం = ఖడ్గమనే ఆయుధమును, అహం = నేను, సదా = ఎల్లప్పుడు, శరణం =రక్షకమని, ప్రపద్యే = పట్టుకొనుచున్నాను.

తాత్పర్యము: వాడుకలో అసురులు అని రాక్షసులు అని రెండు పేర్లతో పిలవడం వుంది. కాని వారిలో సూక్ష్మ భేదం వుంది. పుట్టుకతోనే రాక్షసులైనవారు, అట్లుకాక ప్రకృతిలోని రజస్తమోగుణముల వలన క్రూర స్వభావం గలవారు అసురులు అనబడతారని తే.కం. గోపాలాచార్యులు గారు "ప్రాతర్నిత్యానుసంధేయం" అనే దానిలో తాత్పర్యంలో తెలిపినారు. అట్టివారు దుష్టులై జనులను పీడిస్తుంటారు. వాళ్ళ కంఠములు గట్టిగా బలిసి భయమును గలిగించుతూ ఉన్నతంగా వుంటవి. ఐతే స్వామి చేతిలోని ఖడ్గం (దాని పేరు నందకం ) కంఠములను నరికి వేస్తుంది. కత్తి అంచు చాల పదునుతో వుంటుంది. కంఠముల నుండి ధారలు ధారలు గా రక్తం కారుతూ అంచును వ్యాపించి వుంటుంది. అట్టి మంటలతో వెలుగు చున్న దానిని నాకు రక్షకమని శరణు వేడుచున్నాను.

**(మరికొన్ని విశేషాలు వచ్చే సంచికలో)**






శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి

శ్రీమతే రామానుజాయనమః

**శ్లో॥ అళి మీనాంగనాః కర్కి ధనుస్త్రౌళిః క్రియో ఘటః।**
**పూర్వతో నవసేన్మధ్యే యుగ్మం సింహో వృషో మృగః ॥**

(వ్యవహార సారం)

ఒక వ్యక్తి గృహము నిర్మించనున్న లేదా నివాసము చేయనున్న గ్రామమును తొమ్మిది భాగములుగ విభజించ వలయును. మేషరాశి వారు ఉత్తర భాగము, వృషభ, మిధున రాశివారు మధ్య భాగము, కర్కాటకరాశి వారు నైఋతి భాగము, సింహరాశి వారు మధ్య భాగము, కన్యారాశి వారు దక్షిణ భాగము, తులారాశి వారు వాయవ్య భాగము, వృశ్చిక రాశి వారు తూర్పు భాగము, ధనూరాశి వారు పశ్చిమ భాగము, మకరరాశి వారు మధ్యభాగము, కుంభరాశి వారు ఈశాన్య భాగము, మీనరాశి వారు ఆగ్నేయ భాగము నందు గృహనిర్మాణము కాని నివాసము చేయుట పనికిరాదు. నివాసము చేసిన గృహమును నిర్మించిన చాలా కష్టనష్టములు కలుగును.

గ్రామ మధ్యమనగా బోద్రాయియున్న స్థానమని, ఆస్థానము నుండి దిక్కులను కల్పించి చూడవలయును.

శ్లో॥ **అష్టవర్గా అకారాద్యా పూర్వాది స్థానమాశ్రితాః।**

(ముహూర్త భూషణం)

అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ ౠ ఌ ౡ ఎ ఏ ఐ ఓ ఔ అం అః ఈ పదహారు వర్ణములను అ వర్గమందురు. క ఖ గ ఘ ఙ ఈ ఐదు వర్ణములను క వర్గమందురు. చ ఛ జ ఝ ఞ ఈ ఐదు వర్ణములను చ వర్గమందురు. ట ఠ డ ఢ ణ ఈ ఐదు వర్ణములను ట వర్గమందురు. త థ ద ధ న ఈ ఐదు వర్ణములను త వర్గమందురు. ప ఫ బ భ మ ఈ ఐదు వర్ణములను ప వర్గమందురు. య ర ల వ ఈ నాల్గు వర్ణములను య వర్గమందురు. శ ష స హ ఈ వర్ణములను శ వర్గమందురు. అ వర్గము తూర్పు, క వర్గము ఆగ్నేయము, చ వర్గము దక్షిణము, ట వర్గము నైఋతి, త వర్గము పశ్చిమము, ప వర్గము వాయవ్యము, య వర్గము ఉత్తరము,

| | ఈశాన్యము | తూర్పు | ఆగ్నేయము | |
|---|---|---|---|---|
| ఉత్తరము | శ వర్గము<br>కుందేలు | అ వర్గము<br>ఏనుగు | క వర్గము<br>పిల్లి | దక్షిణము |
| | య వర్గము<br>లేడి | గ్రామ మధ్య<br>స్థానం | చ వర్గము<br>సింహము | |
| | ప వర్గము<br>ఎలుక | త వర్గము<br>సర్పము | ట వర్గము<br>శునకము | |
| | వాయవ్యము | పడమర | నైఋతి | |

శ వర్గము ఈశాన్యము దిక్కులను ఆశ్రయించియున్నవి.

**శ్లో॥ అకారాదిషు వర్గేషు దిక్షు పూర్వాదితః క్రమాత్।**
**గజమార్జాల సింహాశ్వ సర్పాఖు మృగ శాశకాః।**
**దిగ్వర్గ గామి నిలయ స్స్వవర్గాత్పం చమోరిపుః।**
**రిపు వర్గం పరిత్యజ్య శేషవర్గా శ్శుభప్రదాః॥**

(వశిష్ఠ నారద కశ్యపులు)

ఇందులో ప్రతి వర్గము తన వర్గ స్థానము నుండి ఐదవ స్థానము నందు గల వర్గముతో శతృత్వమును పొందును. కావున ప్రతి వర్గము వారు తమ వర్గము మొదలు అయిదవ వర్గమును వదిలి పెట్టవలయును.

**అథేంద్ర కుకుభో వర్గాస్స్యుః తేజస్వినః** (ముహూర్త మార్తాండము) అని చెప్పబడుట వలన ఎల్లప్పుడు స్వవర్గము తనకు బలమును తేజస్సును కలుగ చేయును.

గృహమును నిర్మించుకొను (నిర్మాత) యజమాని గృహమును నిర్మించనున్న గ్రామమునకు ముందుగా యెనిమిది దిక్కులను **(మిగతా 23 వ పేజీలో)**

## తదీయారాధన-

# అన్నదాన కైంకర్యము



**శ్రీమాన్ శ్రీ డా. ఎమ్. టి. ఆళ్వార్, తాడేపల్లి**

**"ఆరాధనానామ్ సర్వేషాం విష్ణోరారాధనం పరం**
**తస్మాత్ పరతరం ప్రోక్తం తదీయారాధనం నృప!"**

శ్రీ మహావిష్ణువు ఆరాధన కన్నా తదీయుల ఆరాధన చాలా గొప్పది. అని పురాణంలో మాట! 'తత్ అనగా భగవానుడు'. 'తదీయులు' అనగా భగవద్భక్తులు అని అర్థం. అట్టి వారిని యథాశక్తి అన్నవస్త్రాది ఉపచారాలతో ఆరాధించుటే తదీయారాధన అని స్పష్టమగుచున్నది.

బీద సాదలకు సామాన్య స్థలములలో ఆయా సందర్భానుగుణముగా చేయు అన్న దానము చాలా గొప్పది. కానీ దేవాలయాలలో భగవంతునికి నివేదించిన ప్రసాదాన్ని అందరితో పాటు బీదసాదలకు కూడా వితరణ చేయటాన్ని తదీయారాధన, నారాయణ సేవ! అని పెద్దలు పలుకుచున్నారు. ఇది దానముగా కన్నను సేవగా కైంకర్యంగా భావించుట కూడా ఉత్తమము. శ్రీమద్భగవద్గీతలో

**"యజ్ఞశిష్టాశిన స్సంతో**
**ముచ్యంతే సర్వకిల్బిషైః**
**భుంజతే తే త్వఘం పాపాః**
**ఏ పచన్త్యాత్మ కారణాత్"** అని శ్రీకృష్ణ పరమాత్మ భగవన్నివేదిత యజ్ఞ ప్రసాదమును స్వీకరించబడి వారి పాపములన్ని తొలగిపోవును అట్లు కాక స్వార్థం కొరకు వండుకొని తినెడు వారు ఈ పాపమునే భుజించు వారవుతున్నారని తెలిపెను. ఉపనిషత్తులలో పలికినట్లు "అన్నాద్వై ప్రజాః ప్రజాయంతే" అని భగవత్ ప్రసాదమును దశరథ మహారాజు వంటి వారు యజ్ఞ శిష్టాన్నముగా భుజించి ఉత్తమ సంతతిని పొందారు కదా!

అలాగే మన దేవాలయములలో జరుగు భగవత్ ప్రసాద వితరణ జాలితో దయతో ఇచ్చునది కాదు సుమా! దేవాలయమునకు విచ్చేయు భక్తులకు భాగవతులకు భక్తి ప్రపత్తులతో అన్నప్రసాదమును వితరణ చేయుటయే తదీయారాధన అని అన్నారు కదా! ఇది స్వార్థంతో కూడిన దానము కాదు సేవాభావముతో వీరు వారను భేదము లేకుండా అందరికీ ప్రసాద వితరణ చేయు చుండుట గమనించాలి. కావున ఈ పరమార్థాన్ని గుర్తించి భగవద్ ప్రసాద వితరణలలో వివిధ సభ్యత్వాలను ప్రతి ఒక్కరూ పొందాలి. అన్న ప్రసాద వితరణచే అందరిలో శ్రీమన్నారాయణుని దర్శించుట తద్వారా భగవదను గ్రహము సంపాదించుట, మానవ సేవ, విశాల దృక్పథము, సంకల్పము చేయుట, సత్సంతానము పొందుట, వంశవృద్ధి, కలుగుతుంది. దీర్ఘ ఆయురారోగ్య ఐశ్వర్య భోగభాగ్యము లను పొందుట జరుగుతుంది అని వేదము చెబుతుంది. 'యేన్నం బ్రహ్మోపాసతే' అని వేదము అన్నప్రసాద వితరణను అనేక విధములుగా తెలుపుతూ బ్రహ్మోపాసన ఇదియే! అనెడి రహస్యాన్ని కూడా పలికినది. అందుకే తదీయారాధనలో అందరూ కలిసి పాలు పంచుకోవాలి. పుట్టినరోజు, పెళ్లిరోజు, పెద్దలు గతించిన రోజు మరియు పర్వకాలములు అన్ని శుభకార్యములు జరుపుకొను సందర్భములలో ఊరి గుడి లోనే తదీయారాధనలు జరుపుకొనుట సమాజ హితానికి మనకు కూడా శ్రేయస్కరము.

**అన్నదాన కైంకర్యము వలన మానవ సేవ, విశాల దృక్పథము, సంకల్పము చేయుట, సత్సంతానము పొందుట, వంశవృద్ధి, దీర్ఘ ఆయురారోగ్య ఐశ్వర్య భోగభాగ్యములను పొందుట జరుగుతుంది అని వేదము చెబుతుంది.**

మన ఊరు మన గుడి! భారతీయతకు సందడి!

# మూడవ వార్షికోత్సవానికి శ్వాస్ సిద్ధం






**శ్వాస్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీమాన్ శ్రీ మంగళగిరి యాదగిరి స్వామి, శ్రీమాన్ శ్రీ పీతాంబరం కిశోర్ ఆచార్య ఒక ప్రకటనలో శ్రీసన్నిధానం పత్రికకు తెలియజేస్తూ వివరించారు.**

"ఇంతింతై వటుడింతయై మరియు తానింతై నభో వీధి పై" అన్న చందంగా శ్రీవైష్ణవ ఆగమ సంప్రదాయ సేవా సమితి (శ్వాస్) క్రమంగా విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో ముచ్చటగా మూడవ వార్షికోత్సవానికి శ్వాస్ సిద్ధం అవుతోంది. ప్రథమ వార్షికోత్సవం ముచ్చింతల్ దివ్య సాకేతంలో, ద్వితీయ వార్షికోత్సవం సూర్యాపేటలో నిర్వహించగా, తృతీయ వార్షికోత్సవం వైకుంఠపురం, సంగారెడ్డి లో నిర్వహించడానికి పెద్దల సమక్షంలో నిర్ణయించారు. మహా మహోపాధ్యాయ డాక్టర్ శ్రీ ఉ.వే. శ్రీమాన్ సముద్రాల వేంకటరంగరామానుజాచార్యస్వామి వారి మార్గదర్శకత్వంలో ఉభయ వేదాంత, ఆగమ సదస్సులు నిర్వహిస్తున్నారు. శ్వాస్ తొలి వార్షికోత్సవంలో ఉభయ వేదాంత సభలు నిర్వహించగా, ప్రస్తుతం శ్రీవైష్ణవ ఆగమ పండిత సమ్మేళనం మరియు సదస్సు నిర్వహిస్తోంది. శ్వాస్ ఆవిర్భవించినప్పటి నుండి వైవిధ్యమైన సంప్రదాయ పనులతో ముందుకు సాగుతోంది. 2020 సంవత్సరంలో ఉత్సాహవంతులైన యువకులతో శ్వాస్ ఏర్పాటు చేయబడింది. శ్వాస్ సభ్యులు కేవలం ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా యావత్ భారతదేశంతో పాటు విదేశాలలో సైతం నేడు విస్తరించి ఉన్నారు. రామానుజ సైనికులం అంటూ శ్వాస్ కార్యకలాపాలకు వారు జీవం పోస్తున్నారు. సంప్రదాయ పరిరక్షణలో అందరిని ఒక త్రాటిపై తీసుకు రావడానికి అవసరమైన వనరులు కల్పించడానికి శ్వాస్ నిరంతరం పనిచేస్తున్నది. ఎక్కడ సంప్రదాయ సేవకు అవకాశం ఉన్నా అక్కడ శ్వాస్ ప్రత్యక్షమై తన విధులను నిర్వర్తించడానికి ముందుకు వస్తోంది. శ్రీవైష్ణవులు తాము వైదిక, సాంప్రదాయ విద్యలను అధ్యయనం చేయటానికి శ్వాస్ చేదోడుగా ఉంటుంది. గత కొన్ని నెలలుగా ధర్మసూక్ష్మాలను తెలిపే పాఠాలను ఆన్లైన్ ద్వారా నిర్వహిస్తున్నారు. శ్రీవైష్ణవ సంఘాలు కూడా ప్రత్యక్షంగా పరోక్షంగా కలిసి నడవడానికి ముందుకు వస్తున్నాయి. వారి బలం బలగం అంతా ఆచార్యుల ఆశీస్సులే!

ఆళ్వార్ కమిటీ, సంప్రదాయ కమిటీ, ఆగమ కమిటీ, ప్రచార కమిటీ ఇత్యాది విభాగాలతో పాటు ఆయా జిల్లాల పట్టణాల కమిటీలు కూడా ఉన్నాయి. శ్వాస్ పరమ భాగవతోత్తముల సూచనలు పాటిస్తూ నిరంతరం ఒక కొత్త ఒరవడిని తీసుకువస్తున్నది. వచ్చే తరానికి సంప్రదాయ విలువలు తెలిసేలా ప్రయత్నాలు చేస్తూ ఉంది. శ్రీవైష్ణవ ఆగమ సంప్రదాయ సేవా సమితి (శ్వాస్) ప్రగతి తెరచిన పుస్తకంలా అందరికీ గోచరం అవుతోంది.

**శ్వాస్**
**తృతీయ వార్షికోత్సవాలు**
**తేది: 09, 10 డిసెంబర్ 2023**
**కార్యస్థలము**
**శ్రీవైకుంఠపురము, సంగారెడ్డి.**

# జ్యోతిర్విజ్ఞానమ్



## శ్రీమాన్ శ్రీ నంబి వేణు గోపాలాచార్య కౌశిక

శ్రీసన్నిధానం పాఠకులు మీ జ్యోతిష్య శాస్త్ర సందేహాలను ప్రశ్నగా మాకు పంపండి, పరిష్కారాలను పొందండి! ఈ విజ్ఞానామృతాన్ని మీరూ ఆస్వాదించండి!!

(గత సంచిక తరువాయి) ప్రాకార వాస్తు.

ప్రహరీ గోడలను నిర్మాణం చేసేటప్పుడు కూడా దక్షిణంలో బరువు ఉండాలి కనుక ఉత్తర గోడ కంటే మందంగా, పునాది తక్కువ లోతు తీయాలి. వెడల్పైన బలమైన గోడను ఏర్పాటు చెయ్యాలి. అలాగే పశ్చిమంలో కూడా తూర్పు పునాది కంటే లోతు తక్కువగా తీసి పశ్చిమ గోడను తూర్పు గోడ కంటే మందంగా, బరువుగా చెయ్యాలి. అలాగే తూర్పు గోడ కట్టేటప్పుడు పశ్చిమ గోడ కంటే లోతైన పునాది తియ్యాలి. పశ్చిమ గోడ కన్న బరువుకన్నా, వెడల్పుకన్న, ఎత్తుకన్నా తక్కువ నిర్మాణం చెయ్యాలని శాస్త్రం చెపుతుంది.

అలాగే దక్షిణ ప్రహరీ కన్న ఉత్తర పునాది ఎక్కువ తీసి దక్షిణ ప్రహరీ కంటే ఉత్తరము పునాది లోతు ఎక్కువ, ఎత్తు తక్కువ, వెడల్పు గాని, బరువుగాని నిర్మాణం చెయ్యాలి. దక్షిణం కంటే పశ్చిమం కొద్దిగా తక్కువ, దానికంటే కొన్ని అంగుళాలు తూర్పు తక్కువ, దాని కంటే కొన్ని అంగుళాలు తక్కువ ఉత్తర ప్రహరీ నిర్మాణం చెయ్యాలి అని మనకు ప్రాకార వాస్తు తెలుపుతుంది.

అదే విధంగా ప్రహరీ గోడలలో వేసేటువంటి వస్తువులు ప్రాచీనంలో పశ్చిమ, దక్షిణ గోడలు పునాది రాయి ఎత్తు పెట్టి కట్టి ఇటుకలు, మట్టి తక్కువ వాడే వారు. ఉత్తర, తూర్పు ప్రహరి గోడలకు పునాది రాళ్ళ బరువు తక్కువ పెట్టి ఇటుకలు, మట్టి ఎక్కువ వాడేవారు. కారణం రాయి మిగతా వాటికంటే బరువైనటువంటి ఘనమైన పదార్థం. ఉదాహరణ: పశ్చిమానికి ఏడు వరుసల పునాది రాయి పెడితే, తూర్పు గోడకు ఐదు వరుసలు పునాది రాయి పెట్టేవారు. దక్షిణం గోడకు ఎనిమిది వరుసలు పునాది రాయి పెడితే, ఉత్తరం గోడకు దానిలో సగం నాలుగు వరుసలు పునాది రాయి పెట్టి కట్టుకోవాలనేది ప్రాకార వాస్తు తెలుపుతుంది.

రాజభవనముల వంటి, గృహ సముదాయముల వంటివి నిర్మాణం చేసినప్పుడు తూర్పు, ఉత్తరాలు గృహాన్నుంచి ప్రాకారానికి స్థలాన్ని ఎక్కువ దక్షిణ, పశ్చిమాలు స్థలాన్ని తక్కువ వదలి పెట్టి నిర్మాణం చెయ్యాలి. స్థానాన్ని తగ్గిస్తూ ప్రాకారాన్ని నిర్మాణాన్ని చెయ్యాలి అనేది శాస్త్ర వచనం.

అదేవిధంగా ప్రహరీ గోడలపైన అందమైన కుడ్యములు అనగా స్తంభాలను నిర్మాణము చేసేవారు. ఆ నిర్మాణాలలో కూడా నైరుతి మూల స్థంభం ఎత్తు, అంతకంటే తక్కువ ఆగ్నేయం, దానికంటే తక్కువ వాయవ్యం, దానికంటే తక్కువ ఈశాన్యం లో నిర్మాణం చేసేటువంటి పద్ధతి వుంది. పూర్వకాలములో గోడలకు గూళ్ళు నిర్మణం చేసి దీపాలు వెలిగించుకొనే సౌకర్యము చేసుకొనేవారు.

అప్పుడు పశ్చిమ, దక్షిణం గోడకు గూళ్ళు ఏర్పాటు చేసి అందులో దీపాలు వెలిగిస్తే ఆ దిశలు తూర్పు, ఉత్తరాలు అవుతాయి కనుక దానిని శుభంగా భావించే వారు. ఈ ప్రాకార వాస్తు చిన్న గృహాల నుంచి పెద్ద పెద్ద భవనాల వరకు కూడా ఇలాంటి నిర్మాణముతో ప్రాకారం ఏర్పాటు చేసుకోవటం వలన ఆ గృహానికి రక్షణనే కాకుండా పక్క గృహాల దోషాలు అంటకుండా ఈ గృహం లో వుండే వారు క్షేమంగా ఉంటారు.

ఇంటి చుట్టూ కూడా ప్రదక్షిణ చేసే విధంగా కాళీ స్థలం వుండి నిర్మాణం చేసేటటువంటి దాన్ని ప్రహరీ అంటారు.

ప్రహరికి ద్వారాన్ని మధ్య తూర్పులో, తూర్పు ఈశాన్యంలో, మధ్య ఉత్తరంలో, ఉత్తర ఈశాన్యంలో, దక్షిణ ఆగ్నేయంలో, పశ్చిమ వాయవ్యంలో ఎలా ఏర్పాటు చేసుకోవచ్చో ముందు ముందు ద్వార వాస్తులో తెలుసు కొందాం.

( వచ్చే సంచికలో మరికొంత తెలుసుకొందాం)

# భరన్యాసము

# భగవంతుని పైనే భారము...

శ్రీమతి వంగల రాధిక



**జీవనగమనంలో కష్టసుఖాలను పరిపక్వతతో స్వీకరించి సాఫల్యం వైపు అడుగులు వేయాలంటే తత్వాన్ని ఎరిగిన పెద్దల ఉపదేశాలను తెలుసుకోవాలి. కిం కర్తవ్యం? అని పరితపించి భగవంతునిపై భారాన్ని ఉంచడం ఎలా? అనే ప్రశ్నకు జ్ఞాన పూర్ణులైన పూర్వాచార్యుల సూక్తులను విస్తృతపరచి అందించే వ్యాసాంశం.**

**"శరణాగతి"** వైష్ణవ సంప్రదాయములో అతిముఖ్యమైన ఆచరణ విభావరి! వైష్ణవులు అంటే ఎవరు? ప్రపత్తి మార్గములో పయనించేవారు! శరణాగతులు! ఆస్తికులు. పరబ్రహ్మమును నమ్మేవారు. "న అస్తి" పరబ్బహ్మమే లేదు అని అనే వారు నాస్తికులు! వేదమును విశ్వసించి వేదమార్గమున పయనించు వారే ఆస్తికులు! దానిని పరిపూర్ణముగా ఆకళింపు చేసుకోలేక వేదములో ఒక్కోచోట ఒక్కోవిధముగా చెప్పినదానిని అన్వయించుకోలేక, ముక్కలు ముక్కలుగా చేసి, వేదములో పేర్కొనబడిన పలు దేవతా స్వరూపములను కూలంకషంగా తెలుసుకోకుండా, వారే పరబ్రహ్మ మని భ్రమపడి ఆచరించే వారిని వైదికులు అని అంటారు. కాని ఆత్మ స్వరూపజ్ఞానమును తెలుసుకొని, పరబ్రహ్మ స్వరూపమును అర్థముచేసుకొని నారాయణ పదమునకును ప్రణవమునకును ఉన్న అంతరార్థమును తెలుసుకొని, పరబ్రహ్మ స్వరూపమును అవగాహన చేసుకొని, ఆచరణలో పెట్టేవారిని వైష్ణవులు అని అంటారు. పరమాత్మనే పరమ పురుషార్థము, వుపాయము, వుపేయము ఆయనే అనే జ్ఞనము కలవారు వైష్ణవులు.

నేను అన్నది నాది కాదు. నన్ను రక్షించుకొనే సామర్థ్యము నాకు లేదు. బాధ్యతనాది కాదు. ఆ రక్షణము వలన వచ్చే ఫలమూ నాది కాదు. అన్నీ పర సమర్పణం అని చెప్పేదే శరణాగతి, భరన్యాసం, ప్రపత్తి. ప్రవృత్తి మార్గములో పయనించే వారు, అన్నిటికీ తామే సమర్థులమని నమ్ము వారు. అహంకార మమకారములతో కర్మల నాచరిస్తే ప్రపత్తి కాదు. ఏదీ నాది కాదు, నేనేమీ చేయలేను. కింకర్తవ్యం! నాకు స్వామిగా వున్న పరబ్రహ్మమే అన్నీ చూసుకొంటుంది అనే ధృఢ విశ్వాసంతో వుంటారు. **"అనన్య సాధ్యే, స్వాభీష్టే, మహా విశ్వాస పూర్వకం, తదేక వుపాయతా యాఞ్చా శరణాగతిః"** అనే ఉపనిషత్ వాక్య రూపేణ నడచుకుంటారు. **"తత్ ఏకం వుపాయం"** శ్రీమన్నారాయణుడే వుపాయము అని మహావిశ్వాస పూర్వకంగా వుండ గలగడం! ధృఢ అధ్యవసానం. అదే శరణాగతి!

**"అహమస్మిన్ అపరాధానామ్ ఆలయః, అకించనః, అగతిన్, త్వమేయ ఉపాయభూతో మే భవ ఇతి ప్రార్థనామతిః శరణాగతిః!"** అంటారు. అంజలి ఘటించి అకించనత్వముతో, పాదముల దగ్గరకు చేరి అగతిత్వమును తెలియజేస్తూ ప్రణమిల్లడము, అకించనుడిగా, అనన్య గతుడిగా వున్న నేను పరమాత్మే ఉపాయము అని ధృఢ అధ్యవసానముతో వుండుటయే శరణాగతి ప్రపత్తి! ఇదే చాలా వుత్తమమైన మార్గముగా మన పురాణేతిహాసాలూ నిరూపించాయి.

దీనిని వేదాంత దేశికుల వారు, వారి 4 కృతులలో ధృఢంగా స్థాపించారు. అవి 1) న్యాస దశకము 2) న్యాస వింశతి 3) న్యాసతిలకం 4) శరణాగతి దీపిక (దీప ప్రకాశర్ పెరుమాళ్ కని చేసిన ప్రబంధము). ఇందులో కవితార్కిక సింహమైన దేశికుల వారు శరణాగతి శాస్త్రమునంతా పదే పది శ్లోకాలలో ఇమిడ్చిన వైనం, అత్యంత ఆశ్చర్యకరం! దానినే "న్యాస దశకం" అని పేర్కొన్నారు!. "న్యాసం న్యాసం" అంటున్నారే అసలు ఈ న్యాసమంటే ఏమిటి? మనకు సన్యాసులను గురించి తెలుసు. సత్ న్యాసం! ఇదేంటో శరణాగతి – అని మొదలుపెట్టి న్యాసమంటూ వెళ్తున్నారు! వీరు ఉద్భోధించే దేమిటి? శరణాగతిని గురించా? లేక న్యాసము దానిగురించా? అనగా న్యసి అంటే వదులుట. సన్ న్యసి బాగా వదులుట! అదేకదా నివృత్తి మార్గము! నేను ఎటువంటి ప్రయత్నము చేసుకోవలసిన పని లేదు! అన్నీ ఆయనే చూసుకొంటారు! కించిత్తు సందేహము లేదు! నేను నాకోసము అన్నీ చూసుకోగలను అన్న భావన లేశమాత్రము లేకుండా వదిలేయడము (మిగతా 17 వ పేజీలో)

# భాగవతంలో భగవంతుని అవతార గాథలు



శ్రీమతి తిరుమల నీరజ

(క్రిందటి సంచిక తరువాయి)

అప్పుడు ఉదయ మధ్యాహ్న సాయంకాలాలు అనే మూడు కాలాల లోను యజ్ఞమూర్తి ఐన ఆదివరాహం లోకాలకు భీతి కలిగించే ఆ రాక్షసరాజు మాయాజాలాన్ని పటాపంచలు చేసే శస్త్రాలలో అత్యుత్తమమైన సుదర్శనచక్రాన్ని ప్రయోగించాడు.

సూర్యుని వంటి ఆ సుదర్శనచక్రం కాంతులు భూమండల మంతా నిండిపోయి ఆ వెనువెంటనే ఆ అసురుని మాయా ఆవరణాన్ని అణచిపారేసింది.

ఆ సమయంలో దితీదేవి తన భర్త ఐన కశ్యపప్రజాపతి చెప్పిన మాటలు తప్పవేమో? అనుకుంటున్నది. అప్పుడు ఆమె వక్షోజాల నుండి రక్తధారలు స్రవించాయి. అది హిరణ్యాక్షుని పతనాన్ని స్ఫురింపజేసింది.



అప్పుడు హిరణ్యాక్షుడు చేసిన వందల మాయలు కృతఘ్నునికి చేసిన ఉపకారాల వలె శ్రీహరి మీద ఏమీ పని చేయక, అన్నీ విఫల మయ్యాయి. అప్పుడు కూడా వెనుకకు తగ్గకుండా పుండరీకాక్షుణ్ని సమీపించి చేతులు చాచి, ఆ వరాహమూర్తి వక్షఃస్థలాన్ని పొడిచి పీడించాడు. మాధవుడు పక్కకు తప్పుకొన్నాడు. దైత్యుడు మళ్లీ తన కఠిన మైన పిడికిలితో గోవిందుణ్ని ఒక్క పోటు పొడిచాడు. హరి అలసిపోకుండా కోపమే ఆకారం దాల్చిందా అన్నట్లుగా, దేవేంద్రుడు వృత్రాసురుణ్ని సంహరించిన విధంగా, వజ్రాయుధం వంటి తన అరచేతితో 'చెళ్లు' మనేటట్టుగా చెంప మీద చరిచాడు. ఆ దెబ్బకు హిరణ్యాక్షుడు గిరగిరా తిరిగి సోలిపోతే అతనికి కళ్లు కనిపించలేదు. అతికష్టం మీద ఆ దెబ్బను తట్టుకొని ఎదురుగా నిలబడ్డాడు.

అట్లా ధైర్యం చెడి లొంగిపోయిన దైత్యునికి మెడ మీద నుండి వేలాడుతున్న జూలుతో, శత్రువుల గుండెలు చీల్చే కోరలతో, పదునైన గిట్టలతో, తన నడుముతో బ్రహ్మాండాన్ని పెటపెట లాడిస్తున్న ఆ వరాహం అతిభీకరంగా గోచరించింది. ఆ విధంగా లోబడిపోయిన దానవరాజు గూబ మీద, ఇంద్రాది దేవతలందరూ ఆనందించేటట్టుగా వజ్రంతో సమానమైన తన కఠోర హస్తంతో దెబ్బ కొట్టాడు వరాహస్వామి. శ్రీహరి కొట్టిన ఆ దెబ్బకు కళ్లు తేలవేసి, దైన్యంతో గాలిదెబ్బకు నేలకూలే వటవృక్షం వలె హిరణ్యాక్షుడు నేలకూలాడు. ఆ ప్రకారంగా ఆ దైత్యవీరుడు రక్తం కక్కుతూ వికృతమైన ఆకారంతో, కనుగుడ్లు బయటికి రాగా, నేల మీద పడి పండ్లు గీటుకొంటూ ప్రాణాలు విడచిపెట్టాడు.

అట్లా పడిపోయిన దనుజరాజును చూసి పద్మసంభవుడు మొదలైన దేవతలు అతని స్థితికి అత్యాశ్చర్యం పొంది, ఈ విధంగా అనుకొన్నారు.

"పరమ శ్రేష్ఠులైన యోగిపుంగవులు యోగ మార్గంతో ఏ మహానుభావుణ్ని తమ మనసులో స్థిరపరచుకొని ఈ శరీరం పోవా లని ప్రార్థిస్తూ ఉంటారో, ఆ శ్రీహరి ముఖపంకజాన్నే దర్శిస్తూ మరణించిన ఈ రాక్షసరాజు పూర్వం చేసుకొన్న పుణ్యం ఎంత గొప్పదో? శ్రీమహావిష్ణువు ద్వార పాలకులు వీరు. మునీంద్రుల శాపంతో నికృష్టమైన ఈ రాక్షసజన్మ ఎత్తారు. వైకుంఠుని చేతిలో హతులై, తర్వాతి జన్మలో ఆ శ్రీహరి శాశ్వత నివాసమైన వైకుంఠంలో నిత్యనివాసులై ఉంటారు. వీరికి ఇక ఎప్పటికీ జననమరణాలు లేవు."

దేవతలందరూ ఆ విధంగా భావించి పద్మనేత్రుడు, భక్తసంరక్షణలో దక్షుడు, రాక్షసులనే ఏనుగులను శిక్షించటంలో సింహ సదృశుడైన పరమాత్మను దర్శించారు. "ఓ కమలదళాక్షా! ఈ సృష్టి లోని ప్రాణికోటి మర్మాలన్నీ నీకు తెలుసు. ఈర్ష్యతో నాపై పగపట్టిన ఈ దుష్ట దనుజుణ్ని సంహరించావు, ఇక అందరికీ అన్నీ శుభాలే కలుగుతాయి!"

(మిగతా 17 వ పేజీలో)

## భరన్యాసము
## భగవంతుని పైనే భారము...

( 15 వ పేజీ తరువాయి ) సన్యాసము! అదే శరణాగతి! శరణం ఆగతి! ప్రపత్తి!. అదే! భరసమర్పణం! మన భారమును ఆయనపై వుంచడం! భరన్యాసం! భరం అంటే బాధ్యత! రక్షించే బాధ్యత! అదే ద్రావిడములో "అడైక్కలం" దేశికర్ అడైక్కల పత్తు అని ద్రావిడ ప్రబంధమును కృపచేసారు! అలా అడైక్కలం చేసేవారలమైన వైష్ణవులు అడియేన్ అని అంటాము! ఈ న్యాసదశకం యొక్క పేటికా విభాగమును వివరించు కుందాము. మొదట చెప్పబోయే విషయమేమిటో తెలియబరచుట! తరువాత దాని వివరణమును విస్తారముగా తెలుపుట! చివరలో సమాపనము ! ఫలస్వరూపము. ప్రథమంగా మన బాధ్యతను పరమాత్మ వద్ద ఎలా సమర్పించాలి? భరసమర్పణం! సర్వ ధర్మాన్ పరిత్యజ్య పరిత్యాగం. నేను, నాకు నాది, నా ఆనందము వీట్లను "వీడుమిన్ ముఱ్ఱవుం" పూర్తిగా వదిలేయండి! న్యాసం! శరణాగతి ఏమిటో చెప్పారు! తరువాత ద్వయ మాహామంత్రముయొక్క పూర్వ వాక్యం "శ్రీమన్ నారాయణ చరణౌ శరణం ప్రపద్యే" శరణాగతి అనుష్ఠానం! పిరాట్టితో కూడిన, నారాయణుని తిరుకమల పాదముల వద్ద, శరణాగతిని అనుష్ఠించుచున్నాను" "శ్రీమతే నారాయణాయ నమః" శరణాగతి అనుష్ఠించి ఏమి కోరుతున్నాను? ఫల ప్రాప్తి ఏమిటి? కైంకర్య ప్రార్థనతో తరవాతి శ్లోకాల్లో మనకు కర్తవ్యాన్ని తెలిపారు. ఈ సంకలనము మన కోసము! అది ఏమిటి? అనగా ఆచార్య సమాశ్రయణము కాగానే! రామానుజ దాసులని పేరుమారిపోయింది ! కాని వారికి శరణాగతి గురించి ఏమి అర్థమవుతుంది? వారికే కాదు ! ఎవరికయినా! సదాచార్యులను ఆశ్రయించి , తిరుమంత్రము, ద్వయము, చరమశ్లోకాల అర్థాలను, వివరముగా తెలుసుకున్న తరువాత కదా సరైన అనుష్ఠానమౌతుంది! అప్పటివరకు, వాచికము, విధాయకము ఐన అనుష్టానమే! అర్థానుసంధానముతో అనుష్టానమే, సదనుష్టానము. అదే పంథాను ఇక్కడ దేశికుల వారు పాటించారు! సదనుష్టానము అంటే అర్థం మాత్రము తెలుసుకోవడమా? ఆచరణ కూడా. సమాశ్రయణము తరువాత, శరీరార్థముగా కాక, ఆత్మార్థముగా జీవనము సాగించాలి.

(సశేషం)

---

## భాగవతంలో భగవంతుని అవతార గాథలు

( 16 వ పేజీ తరువాయి )

అని చేతులు నుదుట జోడించి అందరూ వినమ్రులై హరికి నమస్కరించారు.

ఈ యజ్ఞవరాహావతారం తర్వాత, శ్రీహరి రెండవ అవతారం యజ్ఞావతారం.

స్వాయంభువ మనువు కుమార్తె ఆకూతికీ, రుచిప్రజాపతికీ జన్మించినవాడు సుయజ్ఞుడు. ఇతనికి దక్షిణ అనే కాంత వల్ల "సుయములు" అనే దేవతలు పలువురికి తండ్రి అయ్యాడు. ఆ సుయజ్ఞుడే ఇంద్రుడుగా వెలసి, విష్ణువు వలెనే ప్రపంచాన్ని కష్టాల నుండి గట్టెక్కించాడు. ఇతని అటువంటి సత్ప్రవర్తనను గమనించిన ఇతని తాత (మాతామహుడు తల్లి తండ్రి) మనువు, ఇతన్ని "పరమపుణ్యమూర్తి ఐన శ్రీహరీ!" అని పిలిచాడు. కనుక సద్ జ్ఞాననిధి ఐన సుయజ్ఞుడు ఆనందించి, శ్రీహరిగా అవతరించాడు.

ఇక సాంఖ్యయోగాన్ని ప్రవర్తింపచేసిన ఉపదేశికుడు కపిలుడు శ్రీమహావిష్ణువు మూడవ అవతారం.

స్వాయంభువమనువు, అతని భార్య శతరూప, బ్రహ్మదేవుని దేహం నుండి అవతరించారు. ఆ దంపతులకు ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు అనే పుత్రులు, ఆకూతి, దేవహూతి, ప్రసూతి అనే పుత్రికలు కలిగారు. ఆకూతిని రుచిప్రజాపతికి, దేవహూతిని కర్దమప్రజాపతికి, ప్రసూతిని దక్షప్రజాపతికి ఇచ్చి వివాహాలు చేశాడు.

దేవహూతికీ, కర్దమునికీ వివాహం జరిగిన విధానం చెప్పుకోదగినది.

(సశేషం)

---

**ఆధ్యాత్మిక రచయితలకు, కవులకు ..స్వాగతం :** సమాజ హితానికి, ఆత్మోజ్జీవనానికి మార్గాన్ని చూపిస్తూ వెలుగులు నింపే ఆధ్యాత్మిక, శాస్త్ర, ఇతిహాస పురాణ వైదిక ధర్మ విశేషాలను, రచనలను మాకు పంపండి. ఆధునికులనూ, సామాన్యులనూ ఆలోచింపచేసే రచనలు మాకందించండి.. శ్రీసన్నిధానం మాస పత్రిక ద్వారా పాఠకలోకానికి అందిద్దాం !...

# శ్రీభాష్య మంగళాచరణ శ్లోకము

# అఖిల భువన జన్మ...



శ్రీమాన్ శ్రీ అమరవాది వేంకటనరసింహాచార్యులు

**(క్రిందటి సంచిక తరువాయి) "వినత వివిధ భూత వ్రాత రక్షైక దీక్షే"** అని సౌలభ్యం చెప్పబడింది. వినతులు "విశేషేణ నతాః" పరమాత్మ విషయంలో ఆత్మజ్ఞానం కలిగి ఉపాసన చేసేవారు. వివిధ రకరకాలుగా ఉండేవారు. అనగా మానవులు, వారిలో వర్ణాశ్రమ భేదాలు, దేవతలు మొదలగువారు. భూత అనగా కేవల సర్వప్రాణివాచకం కాదు. ఎవరైతే భగవన్నిష్ఠ కలిగిన వారు **"తేషామేవ అనుకంపార్థం అహం అజ్ఞానజం తమః నాశయావిల ఆత్మ భావస్థః జ్ఞాన దీపేన భాస్వతాః"** ఎవరైతే అనన్య గతి గలిగి తనను ఆశ్రయిస్తారో వారిని రక్షించడానికి వారి హృదయంలో చేరి ఉండి అజ్ఞానాంధకారాన్ని తొలగించడానికి జ్ఞానం అనే వెలుగులు చిమ్మే జ్యోతి చేత వారి తమస్సును నశింప చేస్తాను అని అన్నాడు. **"ఏష ఏవ సాధుకర్మ కారయతి తంఏభ్యో లోకేభ్యో ఉన్నిమీషతి దదామి బుద్ధియోగంతం ఏన మామ్ ఉపయాంతి తే"** తనను పొందడానికి ఏ మార్గం కావాలో ఆ మార్గం తానే ఇస్తాడు. అంతేకాదు అతడు స్మరించకున్నా **"అహం స్మరామి మద్భక్తం"** అన్నాడు. అనగా వారిలోని అజ్ఞానం తొలగించడం తనను పొందడానికి అవకాశం ఇవ్వడం ఎల్లప్పుడూ తనను స్మరించకున్నను స్మరించేలా పనులు చేయడం!

అటువంటి వారే వివిధ భూత అంటే భూత సంబంధ వ్రాత అని షష్ఠీ సమాసం. అనగా ఎవరైతే భక్తి ప్రపన్నులు ఉన్నారో వారికి సంబంధించిన వారు అని అర్థం. భగవంతుని ఆశ్రయించకున్నను వారిని ఆశ్రయిస్తే చాలు అని అర్థం. అందుకు ఆచార్య సూక్తులు **"ఆస్ఫోటయంతి పితరః ప్రనృత్యంతి పితామహాః వైష్ణవో నః కులేజాతః స నస్సంతార ఇష్యతి."** వారి వారి కర్మ పరిపాకంగా పితృ లోకాలలో ఉండే పితృపితామహులు అందరూ తమ కర్మ ఫలాలను అనుభవిస్తూ ఉన్న సందర్భంలో వారి వంశంలో ఎవరైనా వైష్ణవుడు జన్మిస్తే! వైష్ణవుడంటే విష్ణు సంబంధం కలిగి, విష్ణువునే పూజిస్తూ, విష్ణువును శరణాగతి చేసి, విష్ణువు యొక్క అనుగ్రహ పాత్రమైన వాడు జన్మించగానే పితృలు తన వంశంలో పుట్టిన అతను తరింప చేస్తాడని ఒకరితో ఒకరు చెప్పుకొని జబ్బలు చరుచుకుంటారు, నాట్యం చేస్తారు అని చెప్పబడింది. ఇంకా **"పశుః మనుష్యః పక్షీ చ ఏ చ వైష్ణవ సంశ్రితాః తేనైవ తే ప్రయాస్యంతి తద్విష్ణోః పరమం పదం"** పశు పక్షి మనుష్యాదు లెవరైనా వైష్ణవుని ఆశ్రయిస్తే వైష్ణవుల శరణాగతి ద్వారానే వారికి ముక్తి ప్రసాదిస్తాడు.

హరివంశంలో కైలాస యాత్రలో శ్రీకృష్ణ భగవానుడు ఘంటాకర్ణునికి మోక్షం ఇస్తూ అతని సోదరుడు పిశాచ కర్ణునికి కూడా మోక్షం ఇచ్చాడు. అంతేకాదు తన చిన్నతనంలో అమ్మ భయం నుండి కాపాడిన దధిభాండుడు అనేవానికి, అతని భాండానికి మోక్షం ఇచ్చాడు. తనను ఆశ్రయించిన భక్తుని ఆశ్రయించి ఉన్న కుండకు కూడా మోక్షం! అందుచేత ఎవరైతే భక్తి ప్రపత్తులతో తనను ఆశ్రయించి ఆత్మజ్ఞానం కలిగిన వారై పరమాత్మను ఉపాసన చేసేవారు ఉంటారో! వారికి సంబంధించిన వారు పరమాత్మను ఉపాసించకుండా ఉన్నా రక్షిస్తాడు పరమాత్మ.

భట్టర్ వారంటారు

**"అంధో2నందః గ్రహణ వశగః యాతి రంగేశ యద్వత్**
**పంగుః నౌకా కుహర నిహితః నీయతే నావికేన**
**భుంక్తే భోగాన్ అవిదిత నృపః సేవకస్యార్భకాదిః**
**త్వత్సంప్రాప్తౌ ప్రభవతి సదా దేశికో మే దయాళుః"**

గుడ్డివాడు గమ్యం చేరాలంటే కళ్ళు గలవారు వశమై చెప్పినట్టు వింటే గమ్యం చేరగలడు. కుంటివాడు నదిని దాటాలంటే నావ నడిపేవాడు సమర్థుడైతే ఆ నావలో నదిని దాటించగలడు. అట్లే రాజు వద్ద పనిచేసే వాని భార్యా పిల్లలు ఆ వేతనంతోనే సుఖాలు అనుభవించగలుగుతారు. నిన్ను పొందాలంటే దయాళువైన గురువు ఉన్నారు చాలు అంటారు భట్టర్ వారు. వీటి ద్వారా మనకు తనను ఆశ్రయించిన వారే కాకుండా వారికి సంబంధించిన పరమాత్మను ఆశ్రయించని వారిని కూడా పరమాత్మ రక్షిస్తాడు.

ఆ రక్షణే ఏకదీక్షగా అనగా ప్రధానమైన దీక్ష. తానేమైనా వారిని మాత్రం రక్షించాలని సంకల్పం. రామావతారంలో

శ్రీరామచంద్రుడు **"అప్యహం జీవితం జహ్యాం త్వామ్ వా సీతే సలక్ష్మణాం"** అవసరం అయితే జీవితాన్నైనా, నిన్నైనా, లక్ష్మణున్నయినా విడిచి పెడతాను అంటాడు సీతాదేవితో. **"న తు ప్రతిజ్ఞాం సంశృత్య"** ఎవరినైతే రక్షిస్తానని ప్రతిజ్ఞ చేశానో వారిని రక్షించకుండా విడిచిపెట్టను అన్నాడు. ఆపస్తంభ మహర్షి ధర్మ సూత్రాలను రాస్తూ **"కామం, ఆత్మానం, భార్యాం,పుత్రంవా ఉపరుంధ్యాత్ నత్వేవ దాసకర్మకరం"** గృహస్థుడైన యజమాని అవసరం అయితే తనకు నష్టం అయినా భార్యాపుత్రులకు నష్టమైనా నత్వేవ దాసకర్మ కరం అన్నారు. ఇది స్మృతి. **"శృతిర్ స్మృతిర్మమైవాజ్ఞా"** అని పరమాత్మ అన్నాడు. అనగా ఒక మానవుని ప్రవర్తననే ఈ విధంగా ఉండాలని చెప్పారు. అంటే ఇంకా పరమాత్మ గురించి చెప్పేదేమి? కనుక రక్షైక దీక్ష!

**"దదామి ఏతత్ వ్రతం మమ"** అని అన్నాడు. నియమనిష్ఠలతో ఒక వ్రతాన్ని పూర్తి చేస్తేనే వ్రత ఫలితం అభ్యుదయ ఫలం వ్రతం చేసిన వారికే దక్కుతుంది రక్షించడం పరమాత్మ వ్రతం కనుక ఈ అభ్యుదయ ఫలితం పరమాత్మకే! అందుకే వేదం చెప్తుంది "**స బాహుభ్యామ్ నమతి స పతత్రైః ద్యావా పృథివీ సంజనయన్ దేవ ఏకః"** వారి వారి కర్మల ననుసరించి, స్వర్గాన్ని భూలోకాన్ని సృష్టింప చేసేటటువంటి అద్వితీయుడైన పరమాత్మనే వారిముందు చేతులు కట్టుకొని వంగి ఉంటాడట!

అందువలన "రక్షైక దీక్షే" అని పరమాత్మ సౌలభ్యం చెప్పబడింది. అటువంటి పరాత్పరుని మనం శరణాగతి చేస్తే చాలు.

మూడవ పాదమందు శ్రుతిశిరసి... శ్రుతి అనగా వేదము శ్రవణం ద్వారా వ్యాపించేది, నిర్దోషం, అనాది అయినది వేదం. వేదము యొక్క శిరస్సు ఉపనిషత్తులు. సుబాల, నారాయణ మహా ఉపనిషత్తుల్లో పరమాత్మ తత్వం విశేషంగా బోధింపబడ్డది. విశేషంగా ప్రతిపాదింపబడిన పరమాత్మ పర అనగా అర్థం శ్రీమన్నారాయణడే! **"పరమత సేతూన్మానా"** అని తైత్తరియోపనిషత్. అందులో పర అంటే శ్రీమన్నారాయణ అనే అర్థం. **"బ్రహ్మవిదాప్నోతి పరం"** పరమాత్మ కుండే గొప్పనైన సామర్థ్యం ఏమిటి? అనగా **"అభిన్న నిమిత్తోపాదాన కారణత్వం"** సాధారణంగా లోకంలో ఏదైనా కార్యం కావాలి అంటే దానికి నిమిత్త, ఉపాదాన, అసమవాయి కారణాలు లోకంలో వేరువేరుగా కనపడతాయి. పరమాత్మ సృష్టిని చేయాలంటే అంతా పరమాత్మలో నుండే వస్తుంది. ఆయనే చేస్తాడు.ఇలా ఆయనే అన్నీ కనుక అభిన్ననిమిత్త ఉపాదాన కారణం పరమాత్మ అంటారు. అదే వేదంలో దృష్టాంతం చూపిస్తారు. **"యథా ఊర్ణనాభిః సృజతే గృహ్ణతే చ"** (సాలె పురుగు వలె) **"తత్ సృష్ట్వా తథేవానుప్రావిశత్"**.అని. ఈ కార్యముందు పరమాత్మకు ఈ దోషాలు అంటవు. ఎందుకనగా ఉభయలింగాధికరణంలో (న స్థానతో పరస్య ఉభయలింగం అనే అధికరణం) చెప్పబడింది. పరమాత్మకు ఆ దోషాలు అంటవు అని చెబుతూ ఆయనలో సర్వశక్తిత్వం, సర్వసామరస్యం అను కళ్యాణ గుణాలతో పాటు హేయ గుణాలకు ప్రత్యనీకం అను రెండు అధికరణాలు ఉన్నాయి. కాబట్టి దోషాలు అంటవు.


"శ్రుతిశిరసి విదీప్తే" అనగా ఉపనిషత్తులలో గొప్పగా ప్రకాశించే పరబ్రహ్మ. బ్రహ్మ అనే శబ్దం ఇతర చోట్లలో అనేక అర్థాలతో వాడపడుతుంది. ఇక్కడ బ్రహ్మ అంటే బృహత్వం, బ్రహ్మణత్వం చెప్పబడినప్పటికీ శ్రీనివాసే అన్నారు కనుక శ్రియఃపతి లక్ష్మీదేవికి భర్త అని చెప్పబడింది. పరస్మిన్ బ్రహ్మణి అనగా దానియందు పర్యవసానం పూర్వ మీమాంసలో ఉండే విశేష న్యాయం చేత శ్రీనివాసుని యందు అని అర్థం.

మమ నాకు అనగా **"అహమస్మి అపరాధనామాలయః"** అన్నట్టు భగవద్ రామానుజుల వారు. **"శేముషీ భక్తిరూప"** అనగా భక్తిరూప ఉపాసనాత్మక జ్ఞానం కలగాలి. ఉపాసన అనగా "**తైల ధారవత్ అవిచ్ఛిన్న దర్శన సమాకార శృతి సంతతి రూపం"** గా ఉండాలి. నూనె పోస్తున్నప్పుడు క్రిందకు మీదకు ఎట్లా అవిచ్ఛిన్నంగా ఉంటుందో ఆ విధంగా ఉండాలి. ఏదో చేయాలి కాబట్టి చేయటం కాకుండా ప్రీతికారితంగా చేయాలి. పరమాత్మ దర్శన సమాకారంగా ఉండాలి. **"తైల ధారవత్ అవిచ్ఛిన్న దర్శన సమాకార శృతి సంతతి రూప ప్రీతికారిత ఉపాసనాత్మక జ్ఞానం"** అని అర్థం. **"మమ భవతు"** నాకు సిద్ధించు గాక అని ప్రార్థన చేశారు.

దీని ద్వారా సర్వ జగత్కారణుడు పరమాత్మ అని తెలుస్తున్నది. ఆయనను పొందుటకు భక్తి ప్రపత్తులచే నతం చేస్తే చాలు. అని గొప్ప విశేషార్థాలతో ఈ శ్లోకం ఉపదేశించారు. ఇంకా లోతుగా భావన చేసినట్టయితే ఇతర మత నిరసన కూడా ఉంది. దాదాపు పది మతాల నిరసన ఈ శ్లోకంలో ఉంది. (సశేషం)

# తిరుమల కైంకర్యం, పరగత స్వీకారం!

## అవయవ విభూతి



**శ్రీమతి కొడకళ్ళ పద్మజ జ్యోతిర్మయి, చెన్నై.**

(గత సంచిక తరువాయి)

**శైలపూర్ణం స్తనద్వయమ్ :** రామానుజుల వారి మేనమామ అయిన పెరియ తిరుమలనంబి గారు వేంచేసి ఉంటారుట ఎంబరుమానార్ల స్తనద్వయంలో. **"పితామహస్యాపి పితా మహాయ"** అంటూ ప్రారంభమవుతుంది వీరి తనియన్. అంటే తాతగారికే తాతగారు అన్న మాట పెరియ తిరుమల నంబి గారు. వేంకటేశ్వరస్వామివారు బాలుని రూపంలో వచ్చి వీరిని చమత్కారంగా తాతా అని సంబోధించడం జరిగిందిట ఓమారు.



సంస్కృతంలో నాయనా అని ప్రేమగా పిలవడం అన్నమాట. చతుర్ముఖ బ్రహ్మకు తండ్రి శ్రీమన్నారాయణ మూర్తి అయితే ఆయనకు తండ్రి వీరుట. తిరుమల కొండమీద వేంకటేశ్వరస్వామి వారికి తీర్థ కైంకర్యం చేసుకుంటూ ఉండేవారు. లోకంలో మేనమామ పోలికలు మేనల్లుళ్ళకి రావడం సహజం కదా. వీరు తిరుమలలో తీర్థ కైంకర్యము చేసుకుంటే మన ఎమ్బెరుమానార్లు కాంచీపురంలో శ్రీదేవరాజ పెరుమాళ్ళకు తీర్థ కైంకర్యము చేసుకునేవారు అక్కడ వేంచేసి ఉన్న రోజులలో. కాలక్రమేపి లోకోద్ధరణ కోసం సన్యసించి దివ్యదేశయాటన చేస్తూ తిరుమల వేంచేసి నప్పుడు చంద్రుని చూసి సముద్రం ఉప్పొంగిన కెరటాలు కలిగినదైనది అన్నట్టు పెరియ తిరుమలనంబిగారు యతివర్యులను చూసి ఆనందంతో మనసు పరవశించిన వారై వేంకటేశ్వర స్వామి వారి ప్రసాదం తీసుకొని ఎదురేగేరట. అది చూచి యతివరులు స్వామీ! మీరే స్వయంగా ప్రసాదాన్ని తీసుకొనివచ్చారే! మీకంటే చిన్నవారి ద్వారా పంపి ఉండాల్సింది కదా అంటే, ఈ తిరుమల నాలుగు మాడవీధుల్లో నాకంటే చిన్న వారెవరు కనపడలేదండీ!! అన్నారుట పెరియ తిరుమలనంబిగారు. తిరుమలలో దక్షిణమాడ వీధిలో కనిపిస్తుంది వీరు సన్నిధి మనకు. ఇంతటి భాగవత శేషత్వాన్ని కనబరిచిన నంబి గారి మాటలు విని పరవశించి, వారి ద్వారానే భగవంతుని సేవిద్దామని, వారి పురుషకారమే ప్రమాణంగా సేవించారు వేంకటేశ్వరస్వామిని. **"పడికొణ్డ కీర్తి ఇరామాయణమ్ ఎన్నుమ్ పత్తి వెళ్ళమ్ కుడికొణ్డ కోయిల్ ఇరామానుశస్ కుణమ్ కూరుమ్"** అన్నట్టు శ్రీ వేంకటేశ్వరస్వామి వారి సన్నిధానంలో ఉండి, తిరుమల నంబిగారి దగ్గర శ్రీరామాయణ రహస్యార్థాలను క్షుణ్ణంగా శ్రవణం చేశారట రామానుజుల వారు. ఏ విధంగా అయితే తిరుమలనంబి గారు కాయక, వాచక కైంకర్యాలు చేసుకున్నారో, భగవద్రామానుజుల వారి స్తనద్వయాన్ని సేవిస్తే పెరుమాళ్ల కైంకర్యభాగ్యం శ్రీమద్రామాయణ రహస్య అర్థాలు ప్రాప్తిస్తాయిట ఆశ్రితు లందరకు.

**"కుక్షింతు వర రంగార్యం పృష్ఠం మాలా ధరం తథా కటిం కాంచీ మునిం జ్ఞేయం గోవిందార్యం నితంబకం"** సంప్రదాయంలో మనకు రెండు రకము లయిన న్యాయములను చెబుతారు. మొదటిది మర్కట కిశోర న్యాయము. పిల్ల మర్కటమే తల్లి మర్కటమును పట్టుకుంటుంది. పట్టు ఏక్షణమైన జారిపోవచ్చును. రెండవది మార్జాల కిషోర న్యాయము. మార్జాలము తానే తన పిల్లను కరిచి పట్టుకుంటుంది. పట్టు జారదు. భగవంతుని విషయంలో అంతే సాధ్యభక్తే తప్ప సాధన భక్తి నిలువలేదు. ఆయనంతట ఆయన ఈ జీవిని ఉద్ధరించాలి. అని అనుకున్న నాడే ఏదైనా సాధ్యమవ్వగలదు.

(మిగతా 21 వ పేజీలో)

## తిరుమల కైంకర్యం, పరగత స్వీకారం!

## అవయవ విభూతి

( 20 వ పేజీ తరువాయి )

ఇదే పరగత స్వీకార పరుడు అంటే పరమాత్మ మనల్ని ఉద్ధరించడం.

భరతుడు స్వగత స్వీకారంతో రామచంద్రమూర్తి దగ్గరికి వెళ్లి వెనుకకు పిలిచాడు రాజ్యం స్వీకరించమని, కుదరదు అన్నాడు శ్రీరామచంద్రమూర్తి. పరగత స్వీకారుడై తానే వెళ్లి గుహుడు, శబరి,ఆంజనేయ, సుగ్రీవ, విభీషణాదులను అనుగ్రహించాడు. ఆచార్యుల విషయంలో అయినా ఇంతే. అంటే ఆచార్యులే మనల్ని ఉద్ధరించడం అన్నమాట! గత శీర్షికలో చదువుకున్నాం! స్వగత శ్రీకారంతో ఎంబెరుమా నార్లు తిరుక్కోటియూరు నంబి గారి దగ్గరకు వెళ్లి ఆశ్రయించారు. పరగత స్వీకారంతో మహాపూర్ణులే వచ్చి ఎంబెరుమానారులని అనుగ్రహించారు.

**"కుక్షింతు వరరంగార్య"** అంటే భగవద్ రామానుజుల వారి ఉదర భాగం. అక్కడ తిరువరంగ పెరుమాళ్ అరయర్ అనే మహానుభావులు వేంచేసి ఉంటారట! వీరు శ్రీ ఆళవందారుల తిరుక్కుమారులు. వీరి దివ్య ప్రబంధ అరయర్ గానానికి ఎల్లప్పుడూ శ్రీరంగనాథుడు ఆనందించే వాడట! శ్రీరంగంలో రామానుజుల వారిని తమకు ఇమ్మనమని కాంచీపురంలో వేంచేసి ఉన్న దేవరాజ పెరుమాళ్ దగ్గరకు వీరినే పంపించేరట శ్రీరంగనాథులు. ఈయన పేరే వరదరాజులు. **"శ్రీ నిధిం నాథ మపారమర్థినాం అర్థితార్థ పరిదాన దీక్షితం"** అన్నట్టుగా

తమ దగ్గర ఉన్న రామానుజులు అనే అపారమైన నిధిని త్యాగబుద్ధి చేత రాజు దగ్గరకు అంటే రంగరాజు దగ్గరకు చేరవేసిన దయానిధి దేవరాజ పెరుమాళ్ మరి **"రామో ద్విర్నాభిభాషతే"** కదా!

ఉదర భాగం లోని అందమైన నాభి పద్మము పాల సముద్రం మధ్యలో ఒక గోయిలో ఏర్పడిన సుడి వలె ఉన్నదట! అలాంటి స్థానంలో శ్రీ తిరువరంగ పెరుమాళ్ అరయర్ స్వామి వేంచేసి ఉంటారట! కాబట్టి రామానుజుల వారి ఉదరాన్ని సేవిస్తే మనకు ఆచార్య పరగత స్వీకార ప్రాప్తి లభిస్తుందట!


**(మిగతా వచ్చే సంచికలో)**

## పుస్తక పరిచయం

శ్రీరామాయణము సుందరకాండ తత్వ దీపిక వాల్మీకి అను మహర్షిచే అవతరింపబడిన "శ్రీరామాయణము వేదమే! రాముడు దేవుడే" అను పెద్దల మాటల ననుసరించి ఎన్ని యుగాలు కాలాలు మారినా చెక్కుచెదరక సమాజానికి మార్గదర్శనంగా నిలిచేది రామాయణమే! అందులో సుందరాకాండము కథా వైభవము వలన, పఠన పారాయణ ప్రభావము వలన గొప్ప మహత్తు కలిగినది. సుందరకాండ మూలము మాత్రమే పారాయణ మునకు అనుకూలంగా ముద్రించిన గ్రంథాలు ఎన్నో ఉన్నాయి. మూలము తో పాటు భక్తి రసాత్మక భావ వివరణ లతో ఆధ్యాత్మిక తత్వ జ్ఞాన బోధకంగా రచింపబడిన గ్రంథం ఇది.




సంప్రదాయ, రామాయణ, తిరుప్పావై ప్రవచనాలతో దశాబ్దం పాటు ఆధ్యాత్మిక ఆనందంలో ఓలలాడించిన వారు ఉభయ వేదాంత పండితులు,




కీర్తిమూర్తులు, శ్రీమాన్ శ్రీభాష్యం అప్పలాచార్యుల వారు. వారిరచనల్లో సుందరకాండ శ్రీరామాయణము తత్వ దీపిక అనే ఈ గ్రంథం విశేషమైనది. 650 పేజీలకు పైగా ఉండి దాదాపు 12 సార్లు ముద్రణలో వచ్చిన గ్రంథం. ప్రవచనకారులకు, సామాన్యులకు, పారాయణపరులకు ఉపయోగకరమైన గ్రంథం. 'శ్రీరామాయణ ప్రవచన మహా యజ్ఞ నిర్వహణ సంఘము' విశాఖపట్టణం వారి ద్వారా ముద్రించబడినది. పారాయణ క్రమంగా గాయత్రి రామాయణం సంక్షేప రామాయణం సుందరాకాండ సంపూర్ణంగా మూలము ముద్రించబడింది. తదుపరి తత్వ దీపికా వ్యాఖ్యగా శ్రీ రామాయణ పరిచయం, అవతరణము సుందరకాండ తత్వ భావ వివరణలు ముద్రించబడినవి. రచయిత ప్రవచన శిరోమణి శ్రీమాన్ శ్రీ భాష్యం అప్పలాచార్యులు ప్రతులు లభించు ఫోన్ నెంబర్ 9885899662 9885052051.

# శ్రీవైష్ణవ ఆగమ సంప్రదాయ సేవా సమితి (శ్వాస్)

## "సనాతన ధర్మ రక్షణ – సామాజిక బాధ్యత శ్వాస్ ఆవిర్భావం"

విజ్ఞానవంతులమైన మనము, రాజకీయ పార్టీల ప్రస్తావనలు లేకుండా, వ్యక్తిగత ప్రయోజనాలు ఆశించకుండా, మన భారతీయ సనాతన సంప్రదాయములకు కలుగుతున్న విఘాతాలను గుర్తించవలసిన అవసరం ఎంతైనా ఉంది. హైందవ ధర్మ పరిరక్షణలో అన్నిటికి అతీతంగా, సంఘటితం అవటానికి అందరం స్నేహ హస్తం అందిద్దాం! సనాతన విలువలను, సంపదను కాపాడుకుందాం!!

**సనాతన సంప్రదాయ సంపదలు అంటే?**

మన దేవాలయాలు, మన సంస్కృతులు, వేషధారణ,
మన పశు సంపద, ముఖ్యంగా గోసంపద, స్త్రీ సంరక్షణ,
మన దేవీ దేవతలు, పూజా విధానాలు,
కుల, లింగ, వర్ణ వ్యవస్థలు,
నిజమైన ఆచార్య పురుషుల సంరక్షణ,
కులవృత్తులు, మానవ మేధస్సు, ఆహారపు అలవాట్లు
ఆధ్యాత్మిక గ్రంథాలు, వేదాలు, ఆగమాలు, ఇతిహాసాలు, (భగవద్గీత, రామాయణ, మహాభారతాల వంటివి), పురాణాలు,
భారతీయ వివాహ వ్యవస్థలో ఉన్న ప్రామాణిక అంశాలు, కుటుంబ ఆచార వ్యవహారాలు,
మంచి ఆలోచనలతో కూడిన అలవాట్లు, పురావస్తు కట్టడాలు,
నాట్య శాస్త్ర విషయాలు, ఆయుర్వేద వైద్య విధానాలు,
అన్నిటికీ మించి ఇవన్నీ మనవి అనే దృఢ విశ్వాసం!

**మన సనాతన ఆస్తులను, సంపాదనను కాపాడుకోవటం మన బాధ్యతా! కాదా! అవసరమా! లేదా!..** ఈ విషయాల్లో మనకి ఏకాభిప్రాయం అవసరమా! వద్దా! ఆలోచించండి!

నిజానికి సనాతన ధర్మం అన్ని వర్గాల వారికి సముచిత స్థానం కల్పించింది. త్రిమతాచార్యులు అందించిన అద్వైత, విశిష్టాద్వైత, ద్వైత సిద్ధాంతాలే జీవన ప్రమాణాలుగా, విలువలతో కూడిన సమాజ నిర్మాణం జరిగింది. ఆదిశంకర భగవత్పాదులవారిని అనుసరిస్తూ ఏర్పడిన పీఠాలు, జగద్గురువులు భగవద్రామానుజులవారిని అనుసరిస్తూ ఏర్పడిన వైష్ణవ మఠాలు, మహానుభావులు మధ్వాచార్యులవారిని అనుసరిస్తూ ఏర్పడిన మాధ్వమఠాలు ఇలా అనేక ఆధ్యాత్మిక కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డాయి. అందరికీ ఎవరి పరిధులు, బాధ్యతలు, విధులు వారికి నిర్దేశింపబడ్డాయి. ప్రతీ సంప్రదాయం వారికి వారి పెద్దల ద్వారా, ప్రమాణంగా అందించబడిన ఆగమాలు ఉన్నాయి. వైష్ణవ దేవాలయాలకు శ్రీపాంచరాత్ర, శ్రీవైఖానస ఆగమాలు. శైవ దేవాలయాలకు శైవ ఆగమం. శక్తి ఆలయాలకు, పీఠాలకు శాక్తేయ ఆగమం ఇలా ప్రమాణాలు నిర్ణయింపబడ్డాయి. బ్రాహ్మణ వర్గంలో ఉండే అనేక శాఖల వారు దేవాలయాల నిర్వహణ చేస్తూ భక్తులకు, ప్రజలకు ధర్మ మార్గాన్ని ఉపదేశిస్తూ ఉండేవారు. మిగిలిన బ్రాహ్మణ శాఖ వారు స్మృతి సంబంధిత అంశాలపై ధర్మ ప్రభోదం చేస్తూ పౌరోహిత్యం, వివాహాది కార్యక్రమాలు, అంత్య సంస్కారాలు నిర్వహిస్తూ, ప్రజలలో సనాతన విలువపై సంపూర్ణ విశ్వాసం కలిగించేవారు.

దేవీ దేవతలకు, త్రిమతాచార్యులకు ఎన్నడూ లేని ఆధిపత్య ధోరణి నేటి సమాజంలో ఎక్కువగా కనిపిస్తుంది. "ఐస్" అనే అద్భుతమైన పదార్థాన్ని మనకి చూపించినవారు ఒకరు అయితే, దాని ద్వారా ఐస్ క్రీమ్" తయారు చేసుకొని మాధుర్యాన్ని ఆనందించే విధానాన్ని మరొకరు తెలియచేసి, మాధుర్యాన్ని ఆస్వాదిస్తున్నప్పుడు వచ్చే సమస్యలను తగ్గించుకొనే వైద్య విధానాలను మరొకరు అందించారు. ఈ ముగ్గురిలో ఎవరు గొప్ప అనే ఆలోచనే మానవుల పతనానికి నాంది పలుకుతుంది. ఒకటి లేకపోతే మరొకటి లేదు. అన్ని పరస్పరం కలిసి మెలిసి వాటి విలువలను పెంచుతున్నారు. అయితే గత కొన్నేళ్లుగా కొందరు అప్రామాణిక కట్టు కథలు, పుక్కిటి పురాణాలను చెబుతూ, వారసత్వ విలువలను నిర్వీర్యం చేస్తూ, సనాతన ధర్మ వైభవాన్ని తగ్గించేలా కొందరి ప్రవర్తన కనిపిస్తుందని విమర్శలు వినిపిస్తున్నాయి. అంతర్గత ఆధిపత్య పోరుతో, దురాక్రమణ ఆశతో ఉన్నారా! అనిపిస్తుంది. మన హైందవ సమాజానికి ఇతర మతాల బాహ్య శత్రువర్గం కంటే, ఈ అంతర్గత మేధావులతోనే పెను ప్రమాదం పొంచి ఉందా! అని మేధావులు అభిప్రాయ పడుతున్నారు. కొందరు స్వార్థ రాజకీయ పార్టీల వారు దీన్ని ఆసరాగా తీసుకొని సమాజంలో కుల, మత, వర్గ విభజనలు చేసి లౌకిక శక్తుల ఆధిపత్యం పెంచుతున్నారు.

**ఎవరి ధర్మం వారు ఆచరించి, పర ధర్మాలను ఆదరిస్తే అదే మనకి రక్షణ కవచంలా పనిచేస్తుంది.** ఇతర విచ్ఛిన్నకర మతాల వారికి, నాస్తిక వర్గం వారికి జ్ఞానోదయం కలిగిస్తుంది.

**సంప్రదాయ పరిరక్షణమే...శ్వాసగా** **ఆగమ సురక్షణమే...శ్వాసగా**

**ఆచార్య సేవానిరతియే... శ్వాసగా** **భగవద్రామానుజ దివ్యాజ్ఞ అనుసరణయే...శ్వాసగా**

వివిధ దేవాలయాలకు నిర్దేశింపబడిన వేద, ఆగమ ప్రమాణాల ఆధారంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహింపబడేలా,
దేవాలయాల విశిష్టతను మరియు సనాతన సంప్రదాయ వైభవాన్ని ప్రచారం కల్పించటానికి,
ఆధ్యాత్మిక అంశాల్లో సశాస్త్రీయ సత్య ప్రదర్శన చేయటానికి,
శ్రీభద్రాచలక్షేత్ర సీతారామచంద్ర మహాప్రభువుల పరిపూర్ణ అనుగ్రహంతో ఆవిర్భవించినదే ఈ శ్వాస్.

శ్రీవైష్ణవ ఆగమ సంప్రదాయ సేవా సమితి (శ్వాస్)

**పీతాంబరం వేంకట కిషోర్ ఆచార్య, భాగ్యనగరం**
**ప్రధాన కార్యదర్శి**
Working Professional in MNC

## శుభాశుభ నిర్ణయాలు-మీమాంస

( 10 వ పేజీ తరువాయి )

ఏర్పరచుకుని అందులో యజమాని నామాక్షరము ఏ వర్గములో యున్నదో ఆదిశ తన స్వవర్గ మనియు **"స్వస్థానే ప్రాణినో బలవంతః"** అను సూత్రానుసారము అది (నిర్మాత) గృహము నిర్మించుకొను యజమానునకు బలమును, తేజస్సును కల్గించునని తెలుసుకొని అచ్చట గృహమును నిర్మించు కోవలయును.

స్వవర్గమందు గృహము నిర్మించుకొనుట సాధ్యము కానప్పుడు శత్రువర్గ స్థానమును వదలి మిగిలిన స్థానములలో యెచ్చటనైనను గృహము నిర్మించుకున్న శుభప్రదముగా నుండును.

**శ్లో॥ వర్గేశాస్తార్క్ష మార్జాల సింహా శ్వాన సర్ప మూషికాః।**
**ఇబైణౌ పూర్వత స్తేషాం స్వవర్గా త్పంచమోరిపుః।**
**తస్మాత్స్వవైరి వర్గస్య దిశివాసో నశోభనః॥**
(భూపాలవల్లభం)

**శ్లో॥ అ క చ ట త ప య శ వర్గాః ఖగేశ మార్జాల సింహాశనాం। సర్పాఖు మృగ శశానిజ పంచమ వైరిణా మష్టౌ॥**
అని వరాహ మిహురులు గూడా స్వీకరించి యున్నారు.

**శ్లో॥ కేప్యాహు రథ వర్గాణాం స్వస్థానే శుభదం గృహం।**
**మిత్రే సమేచ కర్తవ్యం నకర్తవ్యమరేః పదే** ( జ్యోతిస్సాగరం)

ఈ వర్గములకు స్వత్వ మిత్రత్వ సమత్వ శత్రుత్వములను స్వీకరిస్తూ అందులో స్వవర్గమునందు గృహమును నిర్మించుట విశేష శుభములనియు, మిత్ర సమ వర్గముల యందు నిర్మాణము చేయుట సామాన్య శుభ ఫలములనియు, శత్రువర్గము నందు ఎప్పుడునూ గృహము నిర్మాణము చేయ కూడదనియు చెప్పవలయును.

(వచ్చే సంచికలో మరి కొన్ని విశేషాలు)

# కరీంనగరంలో ఉభయవేదాంత సభ













“సర్వ వైదిక సంస్థానమ్ ట్రస్ట్, సత్సంప్రదాయ పరిరక్షణ సభ ట్రస్ట్” వారి ఆధ్వర్యంలో తేది : 05-11-2023 కరీంనగర్ యజ్ఞవరాహక్షేత్రంలో ఉభయవేదాంత సభ విజయవంతంగా జరిగింది. శ్రీసన్నిధానం పత్రిక సభ్యులు పండితులకు సన్మానం చేయడం జరిగింది. ★

## ఆధ్యాత్మిక వార్తలు

శ్రీమద్భాగవత సప్తాహ మహోత్సవ కార్యక్రమాలు 24 నవంబర్ నుండి 01 డిసెంబర్ వరకు శ్రీశ్రీశ్రీ త్రిదండి అహోబిల జీయర్ స్వామి వారి ద్వారా ప్రవచనాలు కొత్తపల్లి, కరీంనగర్ జిల్లా యందు నిర్వహింపబడుచున్నవి. ★





కార్తీక పౌర్ణమి సందర్భంగా పలు దేవాలయాల్లో కార్తీక దీపోత్సవాలు, ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. ★

### ధర్మపురి లో కార్తీక దీపోత్సవాలు

